సోమవారం
27-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 06
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వైసీపీ ఖాతాలోనే ఆత్మకూరు

82వేల ఓట్ల మెజారిటీతో మేకపాటి విక్రమ్‌రెడ్డి గెలుపు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఉప ఎన్నికల్లో మేకపాటి విక్రమ్ రెడ్డి 82,888 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. అంతకుముందు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందుకోసం ఈనెల 23వ తేదీ పోలింగ్ నిర్వహించి ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఎన్నికల్లో వైసీపీ, బీజేపీ, బిఎస్పీ అభ్యర్థులతో పాటు మరో 11 మంది ఇండిపెండెంట్లుగా బరిలో దిగిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన లెక్కింపులో మొదటి రౌండ్‌నుంచి వైసీపీ తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ వచ్చింది. మొత్తం 64 శాతం ఓట్లు పోల్‌కాగా వాటిని 14 టేబుళ్లలో 20 రౌండ్లుగా విభజించి లెక్కింపు ప్రారంభించారు. పోలైన మొత్తం ఓట్లలో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన మేకపాటి విక్రమ్‌రెడ్డికి 1,02,074 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన భరత్‌కుమార్‌కు 19,353 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ఓబులేసుకు 4,904 ఓట్లు, నోటా కింద 4,182 ఓట్లు నమోదయ్యాయి. దీంతో వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి 82,888 ఓట్లతో ఆధిక్యం సాధించారు. ఇంతటి ఘన విజయానికి కారణం సీఎం చేస్తున్న సుపరిపాలన, ప్రవేశ పెట్టిన పథకాలేనని, తన సోదరుడు

- మిగతా 2 లో

ఇక ప్రత్యక్ష పోరు

ఉక్కు పరిరక్షణసభలో కార్మిక నేతల పిలుపు

- జులై 4న ప్రధానికి నిరసనలు
- కేంద్రం దిగొచ్చేవరకు ఉద్యమాన్ని ఆపబోమని ప్రతిన
- విశాఖలో కదం తొక్కిన కార్మికులు...మహా ర్యాలీ
- 500 రోజుకు చేరిన ఉక్కు పరిరక్షణ దీక్షలు

విశాలాంధ్ర-విశాఖ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయంపై 500వ రోజు ఉద్యమం ఉధృతంగా సాగింది. ఇన్నిరోజులూ వివిధ రూపాల్లో నిరసన తెలిపిన కార్మిక నేతలు... మరో అడుగు ముందుకేసి మహా ర్యాలీ నిర్వహించారు. తొలుత స్టీల్‌ప్లాంట్ ముఖద్వారం నుంచి దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వరకు వేలాదిమంది కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ చేపట్టారు. అక్కడి నుంచి జీవీఎంసీ గాంధీబొమ్మ వరకు మహార్యాలీ చేపట్టారు. అనంతరం.. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సమితి భారీ బహిరంగసభ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రైవేటీకరణ నిర్ణయంపై ఇక నుంచి ప్రత్యక్షపోరుకు దిగుతామని కార్మిక నేతలు ప్రకటించారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కోసం అంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. మళ్లీ తెగించే పరిస్థితి తీసుకురావొద్దంటూ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజకీయ నేతలు సంతకాలు సేకరించి పంపడంతోనే సరిపెట్టకుండా.. రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని హితవు పలికారు. ఖాళీగా ఉన్న ప్లాంటు భూమిని స్థిరాస్థి వ్యాపారానికి వినియోగిస్తామంటే ఊరుకోబోమని కార్మికులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట పరిరక్షణ కోసం స్థానిక మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం జగన్‌తో చర్చించాలని డిమాండ్ చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా... జులై 4వ తేదీన విశాఖ వస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు ఎక్కడకక్కడ నిరసనలు తెలపాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు రక్షణ కోసం ప్లాంట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 500 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ, విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజాసంఘాల జేఏసీ అధ్వర్యాన రైల్వే డీఆర్‌ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు వేలాది మందితో మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు పడాల రమణ, బి.నాగభూషణం అధ్యక్షతన జీవిఎంసి వద్ద బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నరసింగరావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.రఘురామరాజు, పీఓడబ్ల్యు, ఐద్వా రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి, బి.పద్మ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తూ... విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం ద్వారా కేంద్రం విశాఖకు, తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకుల పర్యటనలను అడ్డుకోవాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వాడి తూటాలకు ఎదురొడ్డి అల్లూరి సీతారామరాజు పోరాడిన విశాఖ గడ్డపై కాలుమోపే నైతిక హక్కు ప్రధాని మోదీకి, బీజేపీ మంత్రులకు లేదని అన్నారు. నాడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అల్లూరి పోరాడితే నేడు మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ప్రజల సంపద అయిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణత్యాగం, 22వేల ఎకరాల భూములిచ్చిన 64 గ్రామలకు చెందిన 16500 మంది నిర్వాసితుల త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు అమ్మే హక్కు బీజేపీకి ఎవరిచ్చారని

- మిగతా 2 లో

సర్కారు వారి పాట!



తొలివిడత 248.34 ఎకరాలు అమ్మకం

వేలాన్ని అడ్డుకుంటామని రైతుల హెచ్చరిక

ఎకరం రూ.10 కోట్లు

అమరావతి భూములు విక్రయానికి సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూములను విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నవరత్నాల అమలే లక్ష్యంగా ఎడాపెడా అప్పులు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు అమరావతి భూములపై కన్నేసింది. గతంలో ఈ భూములను తనఖా పెట్టి అప్పు తీసుకోవాలని చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో, ఇప్పుడు ఏకంగా వేలం ద్వారా విక్రయించి సొమ్ము చేసుకోవడానికి రంగం సిద్ధం చేసింది. అమరావతి వ్యవహారాలను పర్యవేక్షించే రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (సీఆర్డీఏ) దీనికి సంబంధించిన ప్రణాళిక రూపొందించింది. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన పేరుతో వివిధ సంస్థలకు కేటాయించిన భూములను అమ్ముకోవడానికి వీలు కల్పిస్తూ శనివారం జీవో 389 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. భూసమీకరణలో భాగంగా రైతులు రాజధాని నిర్మాణానికి ఇచ్చిన సుమారు 34వేల ఎకరాల భూముల్లో తొలి విడతగా 248.34 ఎకరాలను విక్రయించాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. జులై మొదటివారంలో వేలం వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న సీఆర్‌డీఏ ఎకరాకు రూ.10 కోట్లు కనీస విలువగా సర్కార్ వారి పాటను నిర్ణయించింది. ఆ విధంగా మొత్తం రూ.2,480 కోట్లను సమీకరించాలని భావిస్తోంది. రాజధానిలో మెడ్‌సిటీ ఆసుపత్రి నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వం 100 ఎకరాలను కేటాయించింది. అదేవిధంగా లండన్ కింగ్స్ కాలేజీ నిర్మాణం కోసం 148.34 ఎకరాలు ఇచ్చింది. వీటిలో ఆ సంస్థలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఈ భూమిని విక్రయించి డబ్బు సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే గత ప్రభుత్వం వివిధ సంస్థలకు దాదాపు 1300 ఎకరాలు కేటాయించింది. వీటిలో కూడా నిర్మాణాలు చేపట్టని భూములను దశలవారీ అమ్మడం ద్వారా డబ్బు సమీకరించాలని సీఆర్‌డీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. తొలివిడత వేలం విక్రయానికి వచ్చే స్పందనను బట్టి మిగిలిన భూమిని కూడా విడతలవారీ విక్రయించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం అమ్మే 248 ఎకరాలతో పాటు మరో 600 ఎకరాల విక్రయానికి కూడా సీఆర్‌డీఏ ప్రణాళికలు రూపొందించింది.

రాజధాని రైతుల ఆగ్రహం

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన రాజధాని నిర్మాణపనులను అర్థాంతరంగా నిలిపివేసి, హైకోర్టు తీర్పును సైతం అమలు చేయకుండా భూముల అమ్మకానికి ప్రభుత్వం జీవో జారీ చేయడంపై రాజధాని కోసం ఉచితంగా భూములిచ్చిన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమరావతిని ముంపు ప్రాంతమని, ఎడారి అని, శ్మశానమని, ఈ భూమి భవన నిర్మాణాలకు పనికిరాదని, రెట్టింపు ఖర్చు అవుతుందని దుష్ప్రచారం చేసిన ప్రభుత్వం...ఇప్పుడు అదే భూమి అమ్మకానికి ఎలా పనికి వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. పైగా ఎకరానికి రూ.10 కోట్లు ధర నిర్ణయించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం రాజధాని నిర్మాణ ప్రణాళిక చూపించి, ఆవిధంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో రాజధాని నిర్మాణం చేపడతామని హామీ ఇస్తేనే సీఆర్‌డీఏ ఒప్పందం ప్రకారం ఉచితంగా భూములిచ్చామని రైతులు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులు అకస్మాత్తుగా నిలిపివేయడంతో పాటు, మూడు రాజధానుల పాట పాడుతూ రాజధాని ప్రాంతంలో వేసిన రోడ్లను కూడా ధ్వంసం చేసింది. బహుళ అంతస్తుల భవనాలను పాడుపెట్టింది.

చివరకు పేదల కోసం టిడ్కో అధ్వర్యంలో నిర్మించిన ఇళ్లను సైతం వారికి అప్పగించకుండా వాటిని నాశనం చేస్తుంది. హైకోర్టు తీర్పును సైతం ఖాతరు చేయడం లేదు. భూములిచ్చిన రైతులు, మహిళలు, వృద్ధులపై వేలాది అక్రమ కేసులు బనాయించారు. పోలీస్ బలగాలను ఉపయోగించి అనేక వేధింపులకు గురి చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని ఎస్సీలపైనే ప్రయోగించారు. హైకోర్టు తీర్పు

- మిగతా 2 లో

లీజుకు రాజధాని భవనాలు 2లో

అమరావతిని రాజధానిగా ప్రకటించాలి

అప్పటివరకు భూముల జోలికి వెళ్లే హక్కు ప్రభుత్వానికి లేదు: సీపీఐ నేత రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాజధాని భూముల విక్రయానికి సిద్ధమైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముందు అమరావతే ఏపీ రాజధాని అని స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అప్పటివరకు రాజధాని భూముల జోలికి వెళ్లే హక్కు ప్రభుత్వానికి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటివరకు జరుగుతున్న రాజధాని నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేసింది. అది ముంపు ప్రాంతమని, శ్మశానమని, ఎడారి అని, నిర్మాణ ఖర్చులెక్కువ అని, అమరావతి రాజధానిగా పనికిరాదని అనేక విధాలుగా దుష్ప్రచారం చేసింది. ఆ తర్వాత రాష్ట్ర సమగ్రాభివృద్ధి పేరుతో మూడు రాజధానుల పాట అందుకున్నారు. అది ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. తాజాగా ఎంపీ విజయసాయిరెడ్డి ఆరు నూరైనా విశాఖపట్నమే పాలనా రాజధాని అంటూ ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి కూడా రాజధానిపై హైకోర్టు స్పష్టంగా తీర్పు చెప్పినా,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గర్భవిచ్ఛిత్తి మా హక్కు

మహిళల నినాదం - అమెరికా సుప్రీం తీర్పుకు ఖండన

ఆందోళనకు మద్దతిచ్చిన ప్రముఖులు 2లో

అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 50 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. దేశంలో గర్భవిచ్ఛిత్తి (అబార్షన్)కి ఉన్న చట్టబద్ధతను తొలగించింది. 1973లో రో వర్సెస్ వేడ్ కేసులో అబార్షన్‌ను చట్టబద్ధం చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

సుప్రీంకు మహా సంక్షోభం

- రెబెల్స్ నిర్ణయం
- బీజేపీ నేతలతో షిండే రహస్య మంతనాలు
- అనేక చోట్ల అనుకూల-వ్యతిరేక ఆందోళనలు

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. తిరుగుబాటు నేతలు ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. తమపై అనర్హత వేటును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శివసేన శాసనసభ పక్ష నేతగా ఏక్‌నాథ్ షిండే స్థానంలో అజయ్ చౌదరిని నియమించడాన్ని, డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్‌పై అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించడాన్ని తిరుగుబాటు వర్గం సవాల్ చేసింది. అదే సమయంలో ఏక్‌నాథ్ షిండే బీజేపీ నేతలతో రహస్య మంతనాలు జరుపుతున్నారు. ఆయన ఇప్పటికే దేవేంద్ర ఫడ్నవిస్‌తో భేటీ అయినట్లు తెలుస్తోంది. మరోవైపు శివసేన కార్యకర్తలను తనవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్ధవ్ వర్గానికి, షిండే వర్గానికి మధ్య పరస్పరం విమర్శలు పెరుగుతున్నాయి. 'మీరు పార్టీకి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి గెలవండి' అంటూ సీఎం ఉద్ధవ్ సవాల్ చేశారు. సొంత తండ్రుల పేర్లు వాడుకోవాలని, బాలాసాహెబ్ ఠాక్రే పేరు కాదని దుయ్యబట్టారు. తిరుగుబాటు

- మిగతా 2 లో

న్యాయం కోరితే శిక్షిస్తారా?



- సెతల్వాడ్ అరెస్టుపై సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా ప్రశ్న
- ఆమె విడుదల, కేసు ఉపసంహరణకు డిమాండు
- హక్కుల పరిరక్షకులపై వేధింపులు ఆపాలని వామపక్షాల సూచన

2లో

రష్యా పసిడిపై నిషేధం

- అమెరికా, బ్రిటన్, కెనడా, జపాన్ ప్రకటన
- ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా నిర్ణయం

ఎల్మావు క్యాస్టల్ : రష్యా బంగారాన్ని ఇకపై నిషేధం విధిస్తున్నట్లు జీ7లో భాగమైన అమెరికా, బ్రిటన్, కెనడా, జపాన్ దేశాలు ప్రకటించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాయి. ఇదే క్రమంలో రష్యా అనేక ఆంక్షలను ఎదుర్కొంటోంది. తాజా పరిణామం మరో ఎదురుదెబ్బగా ఆ దేశానికి పరిణమిస్తుంది. అమెరికాతో పాటు జీ7లోని నాలుగు దేశాలు కలిసి రష్యా బంగారం ఎగుమతులను నిషేధించాలన్న నిర్ణయాన్ని తీసుకున్నట్లు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆదివారం తెలిపారు. అంతర్జాతీయ బంగారం వర్తకంలో లండన్ కేంద్రమని, అమెరికా, జపాన్, కెనడా కూడా రష్యాపై చర్యలకు పూనుకున్నాయని చెప్పారు. ఈ నిర్ణయం ప్రభావం అంతర్జాతీయ విపణిపై పడుతుందని అన్నారు. 12.6 బిలియన్ పౌండ్లు (15.5 బిలియన్ డాలర్లు) విలువ చేసే వర్తకాన్ని రష్యా 2021లో చేసింది. ఏడు సంపన్న దేశాల శిఖరాగ్ర సమావేశం క్రమంలో తాజా నిర్ణయం జరిగింది. కాగా, ఆరు రష్యా రిఫైనరీలను సస్పెండ్ చేస్తున్నట్లు మార్చి 7న లండన్ బులియన్ మార్కెట్ ప్రకటించిన విషయం విదితమే.

దక్షిణాఫ్రికా నైట్‌క్లబ్‌లో 22 మంది దుర్మరణం

టేబుళ్లు, కుర్చీలు, నేతలపై పడివున్న శవాలు

మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవు

విషప్రయోగం అనుమానాలు - మృతులంతా విద్యార్థులు

జోహనెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలోని ఈస్ట్ లండన్‌లోగల నైట్ క్లబ్‌లో ఓ భాయానక దృశ్యం ఆవిష్కృతమైంది. 22 మంది యువకులు విగత జీవులయ్యారు. ఆదివారం తెల్లవారు జామున వీరు మృత్యువాత పడినట్లు స్థానిక మీడియా చెబుతోంది. అయితే ఇంత మంది ఎలా మరణించారన్న సమాచారం లేదని తెలిపింది. పోలీసుల విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది. అయితే యువకులు మరణించినట్లు తెలిసిన వెంటనే పెద్ద ఎత్తున జనం అక్కడకు చేరుకున్నారు. పోలీసులు, మెట్రో, అంబులెన్సు సేవలను కోరారు. మృతదేహాలు టేబుళ్లు, కుర్చీలు, నేతలపై పడివుండటం, వాటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో విష ప్రయోగం జరిగి ఉండవచ్చు అన్న అనుమానం ఉన్నట్లు సౌత్ ఆఫ్రికన్ డైలీ పేర్కొంది. మృతుల కుటుంబాలు ఘటనాస్థలానికి చేరుకొని తమ వారి కోసం కేకలు పెడుతుండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అంతకుముందు 17 మంది చనిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. సీనరీ పార్కులోని స్థానిక టార్వెన్‌లో మరణాలు సంభవించినట్లు తెలిసిందని స్థానిక పోలీసుల అధికార ప్రతినిధి బ్రిగేడియర్ థెంబిన్‌కోసీ కినారా అన్నారు. మృతులంతా 18-20 ఏళ్ల మధ్య వయస్సు వారన్నారు. నైట్ క్లబ్‌లో తొక్కిసలాట వంటివి జరగలేదని ఈస్టరన్ కేప్ భద్రతాధికారి ఉనతి బిన్కోసే అన్నారు. మృతదేహాలపై గాయాలు లేవని, ఎక్కడ వారు అక్కడే కుప్పకూలి పోయినట్లుగా ఉన్నారని, మృతదేహాలు కుర్చీలు, బల్లలు, నేతలపై పడిపోయి ఉన్నాయని చెప్పారు. చనిపోయిన వారంతా విద్యార్థులు అని హైస్కూలు పరీక్షలు ముగియడంతో పార్టీ చేసుకునేందుకు వచ్చారని బిన్కోసే వెల్లడించారు.

రెచ్చగొట్టారో.. అంతం చూస్తాం

అగ్రరాజ్యానికి డీపీఆర్‌కే హెచ్చరిక

కొరియా యుద్ధానికి 72 ఏళ్లు

అమెరికా వ్యతిరేక ర్యాలీల నిర్వహణ

సియోల్ : మరోమారు తమను రెచ్చగొడితే అంతం చూస్తామంటూ అగ్రరాజ్యాన్ని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఎలాంటి కవ్వింపులను ఉపేక్షించేది లేదని, కనికరం చూపబోమని నొక్కిచెప్పింది. 1950-53 కొరియన్ యుద్ధం 72వ వార్షికోత్సవం సందర్భంగా అమెరికా వ్యతిరేక ర్యాలీలను ఉత్తర కొరియా గురువారం నుంచి నిర్వహిస్తోంది. తాజా ర్యాలీలో పాల్గొన్న వారంతా అమెరికాను అంతమొందించే ప్రతిజ్ఞ చేశారు. ఈ యుద్ధం వార్షికోత్సవం సందర్భంగా ఐదేళ్ల తర్వాత మొదటిసారిగా కార్యక్రమాలను ఉత్తర కొరియా నిర్వహిస్తోందని యోన్‌హాప్ వార్తా సంస్థ తెలిపింది. అమెరికాలో సంబంధాల కాస్తంత మెరుగైన క్రమంలో 2018లో ఇటువంటి ర్యాలీలను ప్యాంగ్యాంగ్ నిర్వహించలేదు. ఆ పై కోవిడ్ మహమ్మారి కారణంగా వీటిని చేపట్టలేదు. డీపీఆర్‌కేను మొగ్గగానే తుంచేయాలని అమెరికా సామ్రాజ్యవాదులు భావించారని ర్యాలీని ఉద్దేశించి మాట్లాడిన వారు ఉద్ఘాటించారు. తమ జోలికి వస్తే అంతమే అంటూ నినదించారు. ఇదే విషయాన్ని కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) పేర్కొంది.

రాజ్యాంగంలో గర్భవిచ్ఛిత్తి హక్కు కల్పించాలి

పారిస్ : మహిళల స్వచ్ఛంద గర్భవిచ్ఛిత్తి హక్కును అమెరికా సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించడంతో అగ్రరాజ్యం భగ్గుమంది. ఆ దేశంలో మహిళలు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. తమ శరీరం.. తమ ఇష్టమంటూ నినాదాలు చేశారు. తాజా పరిణామం దృష్ట్యా తమ దేశంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తకూడదని ఫ్రాన్స్ నాయకులు భావించారు. తమ రాజ్యాంగంలో ఈ హక్కును కల్పించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. న్యాయబద్ధంగా గర్భవిచ్ఛితికి అనుమతిచ్చే 1975 నాటి చట్టం ఫ్రాన్స్‌లో ఇప్పటికే వున్నా రాజ్యాంగబద్ధంగా చట్టం ఉంటే భావితరాలకు ఇలాంటి సమస్య రాదని పార్లమెంటు సభ్యురాలు మేరి పేర్రి రిగ్నెన్ అన్నారు. ఎక్కడో జరిగింది ఫ్రాన్స్‌లో జరగకూడదని చెప్పారు. స్వచ్ఛందంగా గర్భవిచ్ఛితి హక్కును మహిళలకు ఈ బిల్లు కల్పిస్తుందని నేషనల్ అసెంబ్లీ సభ్యులిద్దరు సంయుక్త ప్రకటనలో తెలిపారు. అమెరికా సుప్రీంకోర్టు నిర్ణయం ప్రపంచ మహిళలకు విపత్తుకరమైనదిగా పరిణమిస్తుందని మాక్రాన్ పార్టీ నేత ఔరోరే బర్గే అన్నారు.

గర్భవిచ్ఛిత్తి మా హక్కు

వాషింగ్టన్ : అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 50 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. దేశంలో గర్భవిచ్ఛిత్తి (అబార్షన్)కి ఉన్న చట్టబద్ధతను తొలగించింది. 1973లో రో వర్సెస్ వేడ్ కేసులో అబార్షన్‌ను చట్టబద్ధం చేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అబార్షన్ కోసం భర్త అనుమతి అవసరం లేదని 1976లో మరో సంచలన తీర్పు వెలువరించింది. ఈ విషయాల్లో 50 ఏళ్లుగా న్యాయ పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. అయితే సుప్రీంకోర్టు తాజా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అగ్రరాజ్యంలో మహిళలు ఆగ్రహావేశానికి లోనయ్యారు. రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు. ప్రముఖ నటీమణులు, గాయకులు, రచయిత్రులు కూడా ఆందోళనకు మద్దతిస్తున్నారు. తమ జీవితాన్ని తమకు నచ్చినట్లుగా బతికే స్వేచ్ఛను మహిళలకు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. చాలా ఏళ్లుగా హక్కుల కోసం మహిళలు పోరాడుతునే ఉన్నారని ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ ట్వీట్ చేశారు. మహిళల రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాయడం భయానకం. తనకు నచ్చింది చేసేందుకు మహిళకు హక్కు ఉండాలి. తన శరీరంతో తాను ఏం చేసుకుంటుందనేది ఆమె ఇష్టమంటూ నటీమణి సెలేనా గోమేజ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తాజా పరిస్థితులు కోపం తెప్పిస్తున్నాయని, ఇదంతా ఏమిటంటూ నటుడు హాల్లే బెర్రి అసహనం వ్యక్తంచేశారు. మహిళల కంటే ఆయుధాలకే దేశంలో ఎక్కువ ఉన్నట్లున్నదని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు నిషేధానికి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తే సరిపోదని క్షేత్రస్థాయిలో దీనిపై చర్యలు ఉండాలని పేర్కొన్నారు. 'ఇది చాలా తప్పు మహిళల హక్కులను కాపాడేందుకు చేయగలిగింది చేస్తాను' అని దేశాధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతులు కూడా సుప్రీంకోర్టు తీర్పును ఖండించారు. అయితే డొనాల్డ్ ట్రంప్ మాత్రం దీనిని ప్రశంసించారు. సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకమని కొనియాడారు. న్యాయమూర్తుల మధ్య ఏకాభిప్రాయం లేకుండా 5-3 ఓట్ల తేడాతో ఈ తీర్పు వెలువడింది. సమర్థించిన ముగ్గురు న్యాయమూర్తులు డొనాల్డ్ ట్రంప్ హయాంలో నియమితులైనవారు కావడం గమనార్హం.

సోనియాగాంధీపై బీజేపీ ఆరోపణలు నిరాధారం: కాంగ్రెస్

న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్ల క్రమంలో అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీపై కార్యకర్త తీస్తా సెతల్వాడ్ ప్రచారం వెనుక ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ ఉన్నట్లు బీజేపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించేలా ఆరోపణలు ఉన్నట్లు తెలిపింది. సెతల్వాడ్ ఎన్జీవోకు రూ.1.4కోట్లను కాంగ్రెస్ నేతృత్వ యూపీ ప్రభుత్వంలోని విద్యాశాఖ ఇచ్చిందని, ఆ డబ్బు దేశంలో మోదీ ప్రతిష్ఠను దిగజార్చే ప్రచారానికి ఖర్చు అయిందని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు. ఇందులో సెతల్వాడ్ ఒంటరిగా లేరు.. ఆమెకు చోదకశక్తి ఎవరు? సోనియాగాంధీ, కాంగ్రెస్ అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ ట్విట్టర్ ద్వారా ఆదివారం స్పందించారు. బీజేపీ ఆరోపణలతో నిజం లేదని అన్నారు. అవన్నీ కల్పితం.. నిరాధారమని వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బీజేపీ ఆరోపణలు సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నాయని ట్వీట్ చేశారు. గుజరాత్ అల్లర్ల కేసులో మోదీకి క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసిన విషయం తెలిసిందే.

బీజేపీవి నీచ రాజకీయాలు

రాజిందర్ నగర్ గెలుపుపై కేజ్రీవాల్ హర్షం

న్యూఢిల్లీ : బీజేపీవి నీచ రాజకీయాలని ఆమ్ ఆద్మీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఢిల్లీలోని రాజిందర్ నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి దుర్గేశ్ పాఠక్ గెలుపొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం ట్వీట్ చేశారు. బీజేపీ చేస్తోన్న నీచ రాజకీయాలను ఓడించారని పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజలు తనపై పెట్టుకున్న అభిమానానికి ప్రేమకు కృతజ్ఞత తెలిపారు. ఈ గెలుపు ప్రజల సేవ చేయడానికి మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. బీజేపీ చేస్తున్న దుష్ట రాజకీయాలను ఓడించి మంచి పని చేశారంటూ ప్రజలను అభినందించారు. ఇదిలా ఉండగా ఆప్ అభ్యర్థిగా బరిలో నిలిచిన దుర్గేశ్ పాఠక్ బీజేపీ అభ్యర్థి రాజేశ్ భాటియాపై 11 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్టు ఢిల్లీ ప్రధాన ఎన్నికల కమిషనర్ రణబీర్ సింగ్ తెలిపారు. ఆప్ విజయంపై ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా స్పందించారు. ఈ ఫలితాలు ఢిల్లీ ప్రజల మనసుల్లో కేజ్రీవాల్‌కు పధిలమైన స్థానం ఉందని నిరూపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థికి 40,319 ఓట్లు పోలవగా, బీజేపీ అభ్యర్థికి 28,851 ఓట్లు పోలయ్యాయి.

సర్కారు వారి పాట

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత కూడా ఇప్పటికీ విశాఖపట్నమే పరిపాలనా రాజధాని అని చెబుతూ...రాజధాని నిర్మాణం కోసం ఇచ్చిన భూములను నిబంధనలకు విరుద్ధంగా ఎలా అమ్ముతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వేలాన్ని అడ్డుకుంటామని, అవసరమైతే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఆ మేరకు ఆదివారం రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

విపక్షాల మండిపాటు

రాజధాని ప్రాంత భూములను విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాలు మండిపడుతున్నాయి. రాజధాని నిర్మాణం కోసం మాత్రమే ఆ భూములను విక్రయించాలన్న నిబంధనలను ఉల్లంఘించి దశలవారీగా అమ్మకానికి తెగబడటం దుర్మార్గమని వివిధ రాజకీయపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం ఆరు నెలల్లో రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉండగా, 60నెలల సమయం కావాలని కాలయాపన చేస్తున్న ప్రభుత్వం...ఇప్పుడు భూములు ఎందుకు అమ్మాలనుకుంటోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఓ పక్క మూడు రాజధానులకే కట్టుబడి ఉన్నామని పాలకులు చెబుతూ మరోపక్క రాజధాని నిర్మాణం కోసం రైతులు ఉచితంగా ఇచ్చిన భూములను ఎలా అమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతే కొనసాగుతుందని తొలుత ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, రైతులపై బనాయించిన అక్రమ కేసులన్నీ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాత రాజధాని నిర్మాణ పనులపై అమరావతి జేఏసీ, అఖిలపక్ష నేతలతో చర్చించాలని, అప్పుడు మాత్రమే ప్రభుత్వాన్ని రైతులు నమ్మే అవకాశం ఉంటుందంటున్నారు. అలా కాకుండా గత ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందానికి విరుద్ధంగా ఏ ప్రయత్నం చేసినా మళ్లీ భంగపాటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

లీజుకు రాజధాని భవనాలు

త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం ప్రభుత్వం రాజధానిలో ఇటుక ముక్క కూడా పెట్టలేదని, గ్రాఫిక్స్‌తో కాలయాపన చేసిందని పదే పదే విమర్శలు గుప్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి...ఇప్పుడు అదే రాజధానిలో గత ప్రభుత్వం నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను ఆదాయం కోసం లీజుకి ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. రాజధానిలో అభివృద్ధి పనుల కోసం రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ కాసుల వేట ప్రారంభించింది. ఇందులో భాగంగా రాజధానిలో గ్రూప్-డి ఉద్యోగులకు నిర్మించిన భవనాలను లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఆర్డీఏ చేసిన ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి జగన్ ఆమోదం తెలిపినట్టు సమాచారం. ఇటీవల జరిగిన పురపాలకశాఖ, సీఆర్డీఏ సమీక్షలో అధికారులు చేసిన ఈ ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. విట్ యూనివర్సిటీకి ఇందులో ఒక భవనాన్ని లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.దీని ద్వారా ఏడాదికి రూ.8 నుంచి 10కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది. ముందుగా ఒక యూనిట్ భవనాన్ని లీజు ప్రాతిపదికన విట్ వర్సిటీకి ఇవ్వాలని ఆలోచన చేస్తున్నారు. ఒక టవర్‌లోని 120 ఫ్లాట్‌లను లీజుకు ఇచ్చి ఆదాయం ఆర్జించాలని సీఆర్డీఏ భావిస్తోంది. తదుపరి ఐదు టవర్లను కూడా లీజుకు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. గ్రూప్-డి ఉద్యోగుల కోసం గతంలో ఆరు రెసిడెన్షియల్ టవర్లను ప్రభుత్వం నిర్మించింది. 2019 నాటికే 7.7 ఎకరాల విస్తీర్ణంలో 720 ఫ్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది. 65శాతం మేర పనులు కూడా పూర్తయ్యాయి. 10,22,149 చదరపు అడుగుల సూపర్ బిల్టప్ ఏరియా కూడా అందుబాటులోకి వచ్చింది. మొత్తం ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాల్లో ఒక దానిని లీజుకు తీసుకునేందుకు విట్ యూనివర్సిటీ కూడా ముందుకు వచ్చింది. ఈ భవనాలను లీజుకిచ్చేందుకు త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ కానున్నాయి.

ఇక ప్రత్యక్ష పోరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడంతో పాటు బొగ్గు కొరతను సృష్టించి స్టీల్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఉద్దేశపూర్వకంగానే మోదీ సర్కారు ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతోందని విమర్శించారు. నష్టాల పేరుతో స్టీల్‌ప్లాంట్ అమ్మాలన్న నిర్ణయాన్ని మోదీ ప్రభుత్వం విరమించుకోకుంటే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు పూనుకోవాలని, పార్లమెంట్‌లో రాష్ట్రానికి చెందిన ఎంపీలందరూ ఐక్యంగా మోదీ ప్రభుత్వాన్ని నిలదీసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేసేవరకు ఎన్ని వందల రోజులైనా ఉద్యమం సాగుతుందని, ఆందోళన ఉధృతం చేయకతప్పదని హెచ్చరించారు.

గత 500 రోజుల నుంచి సాగుతున్న ఉద్యమంలో స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబసభ్యులు, నిర్వాసితులతో పాటు విశాఖలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనడం అభినందనీయమన్నారు. వారితోపాటు రెక్కాడితే గాని డొక్కాడని ఇంటిపనివారలు, ఆశ, అంగన్‌వాడీ, మిడ్ డే మీల్, మున్సిపల్, భవననిర్మాణం, తోపుడుబండ్లు, ఆటో, ముఠా, ట్రాన్స్‌పోర్టు, షాప్స్, హోటల్స్, హాస్పిటల్స్, గోడౌన్స్, చిన్నపరిశ్రమలు తదితర అసంఘటితరంగ కార్మికులు ఉద్యమంలో భాగస్వాములయ్యారన్నారు. కార్మికవర్గంతో పాటు విద్యార్థులు, మహిళలు, యువత, మేధావులు, కవులు, కళాకారులు, న్యాయవాదులు, వికలాంగులు, దళితసంఘాలు, పెన్షనర్లు, పత్రికా సిబ్బంది తదితర అనేక రంగాలవారు భాగస్వాములు కావడం ఈ ఉద్యమానికి మరింత ఊపునిచ్చిందని వారందరికీ అభినందనలు తెలిపారు.

ఈ సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయూ నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, జె.అయోధ్యరాం, సిఎఫ్‌టియుఐ నాయకులు పి.సురేష్, వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టియూ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, హెచ్ఎం నాయకుడు దొమ్మేటి అప్పారావు, వైఎస్ఆర్‌టియుసి నాయకుడు వై.మస్తానప్పా, ఏఐసీటీయూ నాయకుడు ఆర్.నానాజీరావు, టీఎన్‌టీయూసీ నాయకుడు వి.రామ్మోహన్ కుమార్, నిర్వాసితుల సంఘం నాయకులు జి.సత్యారావు, పి.భాస్కరరావు, ఏఐటీయూసీ నాయకులు కె.సత్యన్నారాయణ, ఎం.మన్మధరావు, డీవైఎఫ్ఐ నాయకుడు యు.ఎస్.ఎన్.రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎల్.జె.నాయుడు, కేవీపీఎస్ నాయకుడు ఆర్.పి.రాజు, డీహెచ్‌పీఎస్ నాయకుడు ఎ.ప్రభాకర్, జెఎంఎస్ నాయకుడు వరస శ్రీనివాసరావు, ఎల్పీఎఫ్ నాయకుడు వి.రామకృష్ణ, ప్రజానాట్యమండలి నాయకుడు ఎం.చంటి, అరుణోదయ సాంస్కృతిక మండలి నాయకురాలు నిర్మల తదితరులు ప్రసంగించారు. విశాఖలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థల యూనియన్ల నాయకులు, అసంఘటితరంగ యూనియన్ల నాయకులు, కార్మికులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

న్యాయం కోరితే శిక్షిస్తారా?

న్యూఢిల్లీ : ముంబైకు చెందిన మానవహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్టు చేయడాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా తీవ్రంగా ఖండించాయి. ఈ చర్య పౌరుల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమే కాకుండా న్యాయవ్యవస్థను అపహాస్యం చేయడమే అవుతుందని విమర్శించారు. న్యాయం జరుగుతుందని విశ్వసించి న్యాయ వ్యవస్థను నమ్మిందుకు శిక్షిస్తారా అంటూ నిలదీశారు. సెతల్వాడ్‌పై కేసును ఉపసంహరించుకోవలని, ఆమెను తక్షణమే విడుదల చేయాలని వామపక్ష పార్టీలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండు చేశాయి. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు చేశాయి. గుజరాత్ అల్లర్ల బాధితులకు న్యాయం కోసం నిర్విరామంగా శ్రమించే తీస్తా సెతల్వాడ్ పనితీరుపై హెూంమంత్రి అసహనం వ్యక్తం చేసిన కొన్ని గంటల్లోనే గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ఆమెను అదుపులోకి తీసుకోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోందని రాజా పేర్కొన్నారు. ఆమెను వెంటనే విడుదల చేయాలని, మానవ హక్కుల పరిరక్షకులను వేధించడాన్ని ఆపేయాలని ట్విట్టర్ ద్వారా డిమాండు చేశారు. తమ హయాంలో జరిగే మత హింసపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించకూడదని తీస్తా సెతల్వాడ్ అరెస్టు ద్వారా ప్రజాస్వామ్య మనస్తత్వంగల పౌరులకు 'హెచ్చరిక' జారీ అయిందని సీపీఎం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులే ఆమె అరెస్టుకు దారితీశాయని పేర్కొంది. 16ఏళ్ల న్యాయ పోరాటాన్ని ఏదో ఉద్దేశంతో కొనసాగించారని అవమానించడం సబబు కాదని కోర్టు తీర్పునుద్దేశించి వ్యాఖ్యానించింది. న్యాయం కోరిన వారినే ఖైదు చేశారంటూ సీపీఐ-ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వ్యాఖ్యానించారు.

విద్యుత్ ఛార్జీల పెంపు దారుణం

కేరళ ప్రభుత్వంపై విపక్షాల ధ్వజం

తిప్పికొట్టిన సీపీఎం

కొచ్చి : విద్యుత్ ఛార్జీల పెంపు దారుణమని కేరళలోని విపక్ష యూడీఎఫ్ కూటమి, బీజేపీ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఆర్థికంగా భారం మోపుతోందని ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ ఆరోపించారు. ఇప్పటికే ఇంధన ధరలు, నిత్యావసర ధరలు మండుతుంటూ విద్యుత్ ఛార్జీల పెంపును తప్పుబట్టారు. నెల రోజుల కిందట ఆర్టీసీ ఛార్జీలను పెంచిందని పేర్కొన్నారు. కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులో అవినీతి కారణంగా ఆ సంస్థ అప్పుల పాలైందని దుయ్యబట్టారు. ఈ ఆర్థిక భారాన్ని ఛార్జీల పెంపు రూపంలో ప్రజలపైకి నెడుతోందని ఆరోపించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేంద్రన్ సైతం ప్రభుత్వంపై విమర్శలు చేశారు. విద్యుత్ ధరలు భారీగా పెంచారని ఆరోపించారు. సీఎం విజయన్ ప్రతి నెల కొత్త కార్లు కొంటూ ఆ భారాన్ని ప్రజలపై వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం నడస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆరోపణల్ని అధికార ఎల్‌డీఎఫ్ కూటమిలోని సీపీఎం తిప్పికొట్టింది. ప్రభుత్వం ప్రజలపై భారం మోపలేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణ పేర్కొన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఉద్యోగులకు సకాలంలో వేతనాలు కూడా ఇవ్వని ప్రభుత్వాలున్నాయని కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలను ఉద్దేశించి పేర్కొన్నారు. కేరళలో ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. మూడేళ్ల తరువాత విద్యుత్ టారిఫ్‌లను సవరించామని తెలిపారు. కేవలం ఆరు శాతం మాత్రమే ఛార్జీలు పెరిగినట్టు తెలిపారు. పెరిగిన ఛార్జీలు బలహీన వర్గాలకు, వ్యవసాయ వినియోగదారులకు, చిన్న తరహా పరిశ్రమలకు వర్తించదనే విషయాన్ని గుర్తించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖ మంత్రి కె. కృష్ణన్‌కుట్టి ప్రతిపక్షాల వ్యాఖ్యలను తప్పుబట్టారు. పేద మధ్యతరగతి ప్రజలపై భారం లేకుండా విద్యుత్ ఛార్జీలను సవరించినట్టు స్పష్టం చేశారు.

సుప్రీంకు మహా సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

వర్గంలో ఉన్న వారు ఆత్మ చచ్చిన జీవచ్ఛవాలని, తిరిగొచ్చాక శవాలను పోర్టుమార్టం కోసం అసెంబ్లీకి పంపుతారు. రగిల్చిన చిచ్చు పరిణామం వారికి తెలియనిది కాదు' అని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఘాటుగా వ్యాఖ్యానించారు. మరోవైపు షిండే కార్యాలయం వద్ద అనుకూల వర్గం ఆందోళన చేసింది. ఉద్ధవ్ ఠాక్రే దిష్టిబొమ్మలను షిండే వర్గం దహనం చేసింది. శివసేన కార్యకర్తలు ఏక్‌నాథ్ షిండే థానే కార్యలయంతో పాటు అనేక మంది తిరుగుబాటు నేతల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేశారు. చెప్పులతో కొట్టండి అంటూ నినదించారు. పూనేలోని బలగంగాధర్వ ఆడిటోరియం, కోథ్రుడ్ స్థానాల్లో ఆందోళనలు జరిగాయి. ఉద్ధవ్ ఠాక్రేతో ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయ సంక్షోభ పరిస్థితిపై న్యాయ సలహా కోసం మహారాష్ట్ర అడ్వకేట్ జనరల్ అశుతోష్ కుంభాకోణిని అసెంబ్లీ కార్యదర్శి పిలిపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీకి షిండే మద్దతిస్తున్నట్లు కేంద్ర మంత్రి రామదాస్ అథావలే వెల్లడించారు. ఇదిలావుంటే, దమ్ముంటే శివసేన ఎమ్మెల్యేలుగా రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలంటూ తిరుగుబాటు వర్గానికి శివసేన నేతలు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్ సవాల్ విసిరారు. ఈ సంక్షోభాన్ని మహా వికాస్ అగాడీ (ఎంవీయే) అధిగమించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఎంవీయే భాగస్వాముల నుంచి పార్టీని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నానని, నమ్మకం ఉంచండి అంటూ శివసేన కార్యకర్తనుద్దేశించి షిండే ట్వీట్లు చేయడాన్ని రౌత్ దుయ్యబట్టారు. తిరుగుబాటు వర్గంలోనూ తిరుగుబాటు జరగవచ్చు అని పరోక్షంగా హెచ్చరించారు. ముంబైకి తిరిగొస్తే అంతా తెలుస్తుందన్నారు. శివసేన-బాలాసాహెబ్ పేరును ఆ వర్గం వాడేందుకు వీల్లేదన్నారు. బలవంతంగా ఉంచారు కాబట్టి గువహటిలోఉన్న తిరుగుబాటు నేతలు పరస్పరం దాడులు చేసుకున్నా ఆశ్చర్యం లేదన్నారు. తిరిగొస్తే పార్టీలోకి ఆహ్వానిస్తామని చెప్పారు. అదే సమయంలో షిండేను బీజేపీ సీఎం చేస్తుందేమో చూద్దాం అంటూ రౌత్ వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలతో షిండే అర్ధరాత్రి రహస్య మంతనాలు జరగడంపై 'దమ్ముంటే నీ తండ్రి లేదా వడోదర, సూరత్, ఢిల్లీలోని తండ్రుల పేర్లు మీద ఓట్లు అడ్డుక్కో' అని మండిపడ్డారు.

అమరావతిని రాజధానిగా ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

దానిని అమలు చేయడం లేదు. పైగా రాజధాని నిర్మాణానికి అంత ఖర్చు పెట్టలేమని, 60 నెలల సమయం కావాలని అఫిడవిట్ దాఖలు చేశారు. హైకోర్టు తీర్పును సైతం బేఖాతరు చేస్తూ రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించకుండా, మరోప్రక్క భూములు అమ్మడానికి సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. ఆ భూములు రాజధాని నిర్మాణానికి మాత్రమే ఉపయోగించాలన్న నిబంధనలు ఉల్లంఘించడం క్షమార్హం కాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అమరావతే ఏపీ రాజధాని అంటూ స్పష్టమైన ప్రకటన చేయాలి. ఆ తర్వాత భూములిచ్చిన రైతులు, అఖిలపక్ష నేతలతో సమావేశమై రాజధాని నిర్మాణపనులకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలి. అప్పటివరకు రాజధాని భూముల విక్రయ ప్రయత్నాలు విరమించుకోవాలని రామకృష్ణ స్పష్టం చేశారు.

వైసీపీ ఖాతాలోనే ఆత్మకూరు

(మొదటిపేజీ తరువాయి)

మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రజలకు అందించిన అభివృద్ధి చేయూత వల్లనే తాను అత్యధిక మెజార్టీతో గెలుపొందానని విక్రమ్‌రెడ్డి అన్నారు. తనపై నమ్మకంతో ఇంత మెజార్టీ ఇచ్చిన ఆత్మకూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనన్నారు. నియోజకవర్గంలో ప్రధానసమస్య సోమశిల ఉత్తర కాలువ పనులను త్వరలో పూర్తి చేయుడం ద్వారా నియోజకవర్గంలో సాగును పెంచేందుకు కృషిచేస్తానన్నారు. తన అన్న ఆశయాలకు అనుగుణంగా అన్న నడిచిన బాటను స్ఫూర్తిగా తీసుకుని మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఎన్నికల సమయంలో తన విజయానికి కృషిచేసిన వైసీపీ పార్టీ కార్యకర్తలకు, నలుమూలల నుంచి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు పేరుపేరునా ధన్యవాదాలు

'ఉక్కు' ప్రైవేటీకరణ నిలిపివేసే వరకు పోరు

- కేంద్రంపై సీఎం ఒత్తిడి తేవాలి
- అన్ని వర్గాలూ ముందుకు రావాలి
- సీపీఐ సంఘీభావ ర్యాలీలో రామకృష్ణ

ర్యాలీలో పాల్గొన్న రామకృష్ణ. పక్కన కోటేశ్వరరావు, వనజ, దోనేపూడి శంకర్ దుర్గాంబ, రమణారావు తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): ఎన్నో ఉద్యమాలు, 32 మంది బలిదానం, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న ఉద్యమం 500 రోజులకు చేరిన నేపథ్యంలో అక్కడి కార్మికుల పోరాటానికి సంఘీభావంగా సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. విజయవాడ హనుమాన్‌పేటలో జరిగిన ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మూర్ఖంగా, మొండిగా ప్రైవేటీకరించాలని చూస్తోందని మండిపడ్డారు. ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేకపోగా దేశంలో 26 ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరించటానికి బీజేపీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. దేశ సంపదను అదానీ, అంబాలనీలకు అప్పనంగా దోచిపెడుతున్నారని ఆరోపించారు. దేశ చరిత్రలో సుదీర్ఘ పోరాటం జరుగుతున్న విశాఖ ఉద్యమం సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు. విశాఖ ఉద్యమానికి అన్ని ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించమని స్పష్టమైన ప్రకటన చేసే వరకు ఉద్యమం కొనసాగుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం హోదా, రామాయంపట్నం పోర్టు, కడపస్టీల్ ప్లాంట్ ఏర్పాటు వంటి అంశాలపై నోరెత్తటం లేదన్నారు. రాష్ట్రపతి ఎన్నికలకు మద్దతు ఇస్తున్న జగన్ ఈ తరుణంలోనే రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అమరావతి ఉద్యమం 922 రోజులకు చేరుకుందని అక్కడి రైతులు చేస్తున్న ఉద్యమానికి కూడా సీపీఐ మద్దతు ఇస్తుందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పంచభూతాలను సైతం బీజేపీ అమ్మకానికి పెడుతోందని, ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్ వర్గాలకు తెగనమ్ముతోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డీవీ రమణబాబు, తాడి పైడియ్య, అప్పురుబోతు రాము, కేవీ భాస్కరరావు, కొట్టు రమణారావు, తూనం వీరయ్య, కె.ఆనందరావు, మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, మహిళా నాయకులు దుర్గాసి రమణమ్మ, తమ్మిన దుర్గ, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పెయ్యల పృథ్వీ, నగర ప్రధాన కార్యదర్శి ఎం.డి.మొయినుద్దీన్, ఉపాధ్యక్షుడు లంకె సాయి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులేసు, నగర కార్యదర్శి ఎం.సాయికుమార్, సీపీఐ శాఖా కార్యదర్శులు పడాల పెదబాబు, దాసరి దాసు ప్రకాశ్, డి.సూరిబాబు, కె.కోటేశ్వరరావు, పగిడికత్తుల రాము, మురుగేశన్ రాము, డి.బి.కె.రావు, సీహెచ్.వి.రమణ, ఎం.సుబ్బయ్య, సోనా రాజు, పార్టీ నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, జి.వెంకట్రావ్, తిప్పాబత్తుల వెంకటేశ్వరరావు, గాడి రాము, విమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపసంహరించుకునే వరకూ నిరసన తప్పదు: రవీంద్రనాథ్

ఒంగోలు: 'ఉక్కు' ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావుపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలు, విశాఖలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 500రోజులకు చేరుకున్న సందర్భంగా విశాఖ ఉక్కు పోరాట హక్కు పరిరక్షణ వేదిక పిలుపులో భాగంగా ఆదివారం ఒంగోలు అద్దంకి బస్టాండ్‌లో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్న కుట్రలను ఉపసంహరించుకోవాలని రావులపల్లి డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతాయని, దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలతో మూడు నల్లచట్టాలను ఏ విధంగా ఉపసంహరించుకున్నారో అదేమాదిరిగా బీజేపీ ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేనన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం 500 రోజుల నుంచి పోరాటం జరుగుతుంటే కేంద్రానికి చీమకుట్టినట్టయినా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నగర నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, సుబాన్‌నాయుడు, ఏఐఎఫ్టీయూ నాయకులు సాయి, సీపీఎం నాయకులు కొండారెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లి గూడెంలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తిప్పకొడదామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి సోమసుందర్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం 500 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఏఐటీయూసీ నేతృత్వంతో తాడేపల్లి గూడెంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఆర్టీసీ డిపో వద్ద భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం నగరంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కార్మికవర్గానికే కాక రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం అవసరమైతే ప్రతిఘటనా పోరాటాలకు సిద్దపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల పేరుతో తిరిగి అధికారం చేపట్టాలని చూస్తున్న జగన్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడని పక్షంలో రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఏపీ తెలంగాణ రాష్ట్రాల బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి తోట సూర్యనారాయణ, బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి బ్యాంక్ ఉద్యోగుల తరపున పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నామని తెలిపారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ, వివిధ సంఘాల నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



'సుద్దముక్క'పై విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు..

ఉద్యమస్ఫూర్తిని చాటుకున్న బీటెక్ విద్యార్థి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అంటూ 500 రోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమ స్ఫూర్తితో తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి కోడూరి నాగ సూర్య రాఘవేంద్రబాబు సుద్దముక్కపై 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, 500వ రోజు' అని చెక్కి ఉద్యమస్ఫూర్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రబాబు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ఎంతోమందికి ఉపాధి కల్పించిందని, కార్మికులు గత 500 రోజులుగా చేస్తున్న ఉద్యమానికి నా వంతు సంఘీభావంగా తాను ఇలా సుద్దముక్కపై చెక్కానన్నారు. భవిష్యత్తులో విశాఖ ఉక్కు ఉద్యమంలో తాను కూడా పాల్గొంటానని చెప్పారు.

బీజేపీ విధానాలతో దేశం దివాలా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి

మాట్లాడుతున్న హరినాథరెడ్డి. పక్కన కాలేషా, మురళి, ప్రభాకర్ తదితరులు

విశాలాంధ్ర-గూడూరు: రాష్ట్రపతులుగా దళితుల ఎంపిక సరే మరి దేశ వ్యాప్తంగా దళితులు, మైనారిటీలపై దాడుల సంగతేమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సీపీఐ గూడూరు నియోజకవర్గ సమితి సమావేశం పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక 58 శాతంగా ఉన్న రూపాయి విలువ 78 శాతానికి పడిపోయిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలతో కొత్త పెట్టుబడులు రాకపోగా ఉన్న పెట్టుబడులు, షేర్లు కూడా వెనక్కు వెళ్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, హక్కులు అడగకుండా రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు అందరి కంటే ముందు జగన్ ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దీనికితోడు ప్రతిపక్ష నేత చంద్రబాబు సైతం బిజెపి అభ్యర్థికే మద్దతు ఇస్తారనీ, రాష్ట్రంలో అందరూ బీజేపీ మద్దతుదారులుగా మారిపోవడం దారుణమన్నారు. సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ సీపీఐ శాఖ, మండల, నియోజక వర్గ మహాసభలు పూర్తి చేసి జిల్లా మహాసభలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ గూడూరులో సీపీఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు వెయ్యి ఎకరాల భూములను సీపీఐ పోరాటంతోనే సాధించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సీవీఆర్ కుమార్, ఎంబేటి చంద్రయ్య, సీతా భాస్కర్, కె నారాయణ, షేక్. జమాలుల్లా, చల్లా వెంకటేశ్వర్లు, రమేష్, సుబ్బయ్య, రమేష్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

రాజధాని భూములు వేలం వేస్తే ఊరుకోం

బహుజన జేఏసీ కన్వీనర్ బాలకోటయ్య హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధాని అమరావతిలోని భూములను వేలం పాటల ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం దుర్మార్గమైన ఆలోచన చేస్తోందని, తక్షణమే ఆ ప్రయత్నాలను విరమించుకోకపోతే భూముల వేలాన్ని అడ్డుకోవడమే గాక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అమరావతి బహుజన జేఏసీ కన్వీనర్ పోతుల బాలకోటయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ఇప్పటికే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, కనబడిన భూముల్ని కాలువలను, గుట్టలను, కొండలను, భవనాలను తాకట్టుపెట్టి, దోపిడీ చేసిన ప్రభుత్వానికి రాజధాని భూములపై ఎప్పటి నుంచో కన్ను పడిందని చెప్పారు. జీవో 389 ద్వారా తొలి విడతగా పలు సంస్థలకు కేటాయించిన 248.34 ఎకరాలను ఎకరం రూ.10 కోట్లు చొప్పున 2,480 కోట్లకు అమ్మేందుకు సీఆర్డీఏ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అమరావతి ఎడారి అని,శ్మశానం అనీ పేర్లు పెట్టిన ప్రభుత్వం రాజధాని భూములను ఎలా అమ్ముతుందని ప్రశ్నించారు.

ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్

కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం ఆదివారం కృష్ణా జిల్లా మచిలీపట్నం గోల్డ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 26 జిల్లాల నుంచి బంగారు వర్తకులు, అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. సభాధ్యక్షత వహించిన ఉడతు కిషోర్, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో గాయనీ మణి విశ్వనాథ శాంత కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి వందేమాతరం, దేశభక్తి ప్రార్ధన గీతంతో సమావేశాన్ని ప్రారంభించారు . ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), బంగారు వర్తకం.. వ్యాపారంలో వారు పడే లాభనష్టాలను వివరించారు. అనంతరం జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికలలో ప్రెసిడెంట్‌గా కపలవాయి విజయ్ కుమార్, చీఫ్ ఆర్గనైజర్ గా శాంతిలాల్ జైన్, ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి శంకర్రావు, కోశాధికారిగా అనిల్ జైన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దుల గిరీష్ కుమార్, జయం విశ్వనాథ్, బి మల్లేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ అచ్చాభా, ముడా చైర్మన్ బొర్రా భవాని, విట్టల్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గో సంఘం అధ్యక్షులు పల్లపోతు సుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ లంక సూరిబాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా ఊటీకి ఏమైంది?

- అరకు అందాలు కనుమరుగు
- రోజురోజుకు తగ్గుతున్న కళ
- పర్యాటక ప్రేమికుల విచారం
- పట్టించుకోని పాలకులు



విశాలాంధ్ర-అరకులోయ రూరల్: ఆంధ్ర కశ్మీర్ అంటే లంబసింగి గుర్తుకు వస్తుంది. ఆంధ్రా ఊటీ అంటే అరకులోయ మదిలో నిలుస్తుంది. నాటి విశాఖ జిల్లా..నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న అందాల అరకు లోయలో రానురాను అందాలు కనుమరుగవుతున్నాయి. కనువిందు చేయాల్సిన ప్రాంతాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే ఆంధ్రా ఊటీ అందాల అరకులోయ అనే పేరుకు సార్థకత చేకూర్చేలా కొద్ది నెలల క్రితం వరకు అరకు లోయ అందాలు పర్యాటకులను, దేశ విదేశీ సందర్శకులకు కనువిందు చేసేవి. అరకు ప్రాంతంలో ఏడాది పొడుగునా సినిమా షూటింగులు జరిగేవి. నిత్యం పర్యాటకుల తాకిడి ఉండేది. వాహనాల రాకపోకల రద్దీ కనిపించేది. అయితే ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అరకు అందాలను పరిరక్షించాల్సిన పాలకులే వాటిని భక్షించేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆంధ్రా ఊటీ పేరుకు మాయనిమచ్చ తీసుకొస్తున్నారు. ఇప్పటికీ ఎప్పటికీ తమిళనాడులోని ఊటీ కనువిందుచేసే అందాలతో మైమరిపిస్తోంది. సుందర దృశ్యాలతో మంత్రముగ్ధులను చేస్తోంది. అక్కడి ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలతో ఊటీ ఎప్పటికీ స్వర్గధామంగానే ఉంటుంది. ఊటీ అందాలకు ఏమాత్రం తక్కువకానందునే అరకు లోయకు ఆంధ్రా ఊటీ అనే పేరు వచ్చింది. ఇక్కడ కూడా అద్భుత సుందర దృశ్యాలున్నాయి. మైమరపించే ప్రకృతి సోయగాలు సందర్శకులకు కనువిందు చేస్తాయి. మంచుతో కూడిన మనోహర దృశ్యాలు సాక్షాత్కరించేవి. అయితే, ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. అరకు ప్రాంతంలో ఎటు చూసినా అందాలు కనుమరుగైపోతున్నాయి. అరకులోయ అత్యంత అధ్వానంగా ఎందుకు మారిందని పర్యాటక ప్రేమికులు వాపోతున్నారు. అందాలను పరిరక్షిస్తుంటే పర్యాటక పటంలో అరకులోయకు సుస్థిర స్థానం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత ఆంధ్రాకు అందాలు కనువిందు చేసే ప్రాంతం కేవలం అరకులోయ మాత్రమేనని, అటువంటి ప్రాంతం నేడు అందవిహీనంగా మారుతుంటే తట్టుకోలేకపోతున్నామని పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల నిర్వాకమో, అరకు ప్రజల మౌనమో తెలియదు కానీ...అద్భుత ఆంధ్రా ఊటీ అందాలు కనుమరుగవుతున్నాయి.

విక్రమ్‌రెడ్డిని గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు

మంచి చేస్తున్న ప్రభుత్వానికి ఆశీస్సులంటూ సీఎం జగన్ ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం చేసిన మంచికి మద్దతుగా, గౌతమ్‌కు నివాళిగా 83 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చారని సీఎం ఆదివారం ట్వీట్ చేశారు. విక్రమ్‌రెడ్డిని గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి దేవుని చల్లని దీవెనలు, మీ అందరి ఆశీస్సులే శ్రీరామ రక్ష అంటూ సీఎం పేర్కొన్నారు.

వైసీపీ వికృత పోకడలు ప్రజలు గమనిస్తున్నారు

మూల్యం చెల్లించుకోక తప్పదు: చంద్రబాబు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ వికృత పోకడలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలో సచివాలయ ఉద్యోగి వాసుదేవరావుపై సర్పంచ్ భర్త గున్నయ్య దాడిచేశారు. ప్రకాశం జిల్లా అల్లూరులో మంత్రిని సమస్యలపై ప్రశ్నించారని కవిత అనే మహిళ ఇంటికి కరెంట్ తొలగించి పాలు, నీళ్లు కూడా అందకుండా చేశారు. రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ అహంకారానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ఉద్యోగులు, ప్రజల పట్ల వైసీపీ గూండాలు వ్యవహరించిన తీరు ఒకటైతే...దాన్ని సమర్థించిన ప్రభుత్వం తీరు మరింత విస్తుగొలుపుతుంది. పోయేకాలం దాపురించి కన్నుమిన్ను కానకుండా వ్యవహరిస్తున్న వైసీపీ రాక్షసులు వీటన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని చంద్రబాబు హెచ్చరించారు. సిగ్గున్న ప్రభుత్వం అయితే శ్రీకాకుళంలో దివ్యాంగ ఉద్యోగిపై దాడి, ప్రకాశం జిల్లాలో మహిళపై జరిగిన వేధింపులకు తలదించుకోవాలి. వెంటనే కారకులపై చర్యలు తీసుకోవాలి. బాధితులను క్షమాపణ కోరాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

అమరావతిలో భూములమ్మే జీవో రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతిలో రాజధాని అభివృద్ధికి రైతుల నుంచి సమీకరించిన భూములను దశలవారీగా అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 389 జీఓ వెంటనే ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలోని భూములను తొలిదశలో 14 ఎకరాలు వేలం ద్వారా అమ్మాలని నిర్ణయించడం శోచనీయమన్నారు. రానున్న రోజుల్లో ఇది మరింత వేగవంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని కోరారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేననీ, మూడేళ్ల కాలంలో రాజధాని నిర్మాణాన్ని వైఎస్సార్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకుండా మభ్య పరుస్తోందన్నారు. హైకోర్టు ఆదేశాల అనంతరం నిధుల కొరత పేరుతో రాజధానిని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాజధాని అభివృద్ధికి నిధులు సాధించాలన్నారు. ఆ నిధులతో రాజధానిని అభివృద్ధి చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులను తోడు చేయాలన్నారు. ప్రజోపయోగమైన కార్యక్రమాలకు వినియోగించాల్సిన భూములను అమ్మకానికి పెట్టడం తగదన్నారు. జీవో నంబర్ 389 రద్దు చేయాలనీ, రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించాలనీ, కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలనీ, రైతుల ప్లాట్లలో సదుపాయాలు కల్పించాలనీ,. కూలీలు, పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి పీఠమే బీసీల ఎజెండా

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో అగ్రకుల రాజకీయ పార్టీలు బీసీలకు పదవులు ఇచ్చి, తాయిలాలతో లోబర్చుకుని 2024 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నారని, బీసీలు మంత్రి పదవులకు, రాజ్యసభ సీట్లకు రాజీపడరని, బీసీ ముఖ్యమంత్రి పీఠమెక్కడమే తమ ప్రధాన ఎజెండా అని బీసీ సంఘాల నేతలు ప్రకటించారు. ఆదివారం స్థానిక కన్వెన్షన్ హాల్‌లో వివిధ బీసీ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులతో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ప్రజాస్వామ్యంలో మెజార్టీ ప్రజలకు పాలనా పగ్గాలు దక్కాలని, కాని ఇందుకు విరుద్ధంగా మైనార్టీగా ఉన్నవారు మెజార్టీ వర్గాలపై పెత్తనం చేస్తున్నారని దీనిని సహించబోమని, ఆరు నెలల్లో వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యమంత్రి సీటు బీసీలకు ఇస్తున్నట్లు ప్రకటించాలని లేదంటే బీసీలంతా ఏకమై ప్రత్యేక రాజకీయ పార్టీని ప్రకటిస్తామని ఏపీ, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు, జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఏపీలో 60శాతం జనాభా ఉండి, 130కి పైగా కులాలు ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రాలేదని, భవిష్యత్‌లో ఏ పార్టీ కూడా బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదని కేసన అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని, కుటుంబ పార్టీలుగా మారి బీసీలను అణగదొక్కుతున్నాయని మండిపడ్డారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపడతామని, తిరుపతిలో బీసీ ప్లీనరీ నిర్వహించి బీసీ పార్టీ ప్రకటించనున్నట్లు అయన తెలిపారు.

జాజుల మాట్లాడుతూ, తెలంగాణ, ఏపీలో అగ్రకుల పార్టీలు బీసీలను పాలేర్లుగా చూస్తున్నాయని, పవర్ ఉన్నా పదవుల వాళ్లు అనుభవిస్తూ... పవర్‌లేని పదవులు బీసీలకు ఇచ్చి సమాజిక న్యాయం అంటూ తెగ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. వైసీపీ, టీఆర్ఎస్ పార్టీలు ముఖ్యమంత్రి పదవి, పార్టీ పగ్గాలు బీసీలకు ఇవ్వగలరా అని ప్రశ్నించారు.

రిటైర్డు ఐఏఎస్ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీలు కులాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ఐకమత్యం ద్వారానే బీసీలు ఏదైనా సాధించగలరని అన్నారు. సమావేశంలో వివిధ డిమాండ్లపై తీర్మానాలను ఆమోదించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, గౌరవాధ్యక్షులు కన్నా మాష్టారు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఈశ్వర ప్రసాద్, ఎస్ఆర్ నాగభూషణం, పావులూరి హనుమంతరావు, బ్రహ్మానంద శర్మ, తన్నీరు ఆంజనేయులు, బీసీ కుల సంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఇద్దరి ఆత్మహత్య

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం విశ్రాంతపురంలో ఆదివారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, గత పదేళ్లుగా సహజీవనం చేస్తున్న శివనాగేంద్రబాబు (43), నాగరాణి (35) కుటుంబ కలహాల నేపథ్యంలో కూల్‌డ్రింక్‌లో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నాగరాణి తన భర్త మృతి చెందిన నాటినుంచి 10 సంవత్స రాలుగా శివ నాగేంద్రబాబుతో శేరికలవపూడి శివారు విశ్రాంతిపురంలో సహజీవనం చేస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీ ఏసోబు తెలిపారు.

కడలీ..ఓ కడలీ..!

మూలం: రష్యన్
అనువాదం: కేశవ్‌గోపాల్,
సెల్: 7989001058

కడలి-
తీరాన్ని కెరటాలతో ఢీ కొడుతోంది
నురగలు గక్కుతూ...
పక్షులు-
నా అసూయాద్వేషాలకూ
వ్యథాభరిత అపేక్షలకూ, గీతాలకూ
అతీతంగా-
రెక్కలు చాపి
విహరిస్తున్నాయి గగనంలో
స్వేచ్ఛగా కేరింతలు కొడుతూ..!
పవనాలు-
నేర్పుతున్నాయి కెరటాలకు
కన్నీరు మున్నీరు కావడమెలాగో,
నేర్పుగా నర్తించడమెలాగో,
ఉవ్వెత్తున ఎగసి పడటమెలాగో,
కిందకు జారి నా పాదాల్ని
ముద్దాడడమెలాగో..!
కెరటాలు-
లాలిస్తూ, బుజ్జగిస్తూ సుతారంగా
హత్తుకుంటున్నాయి నన్ను
తమ స్వేచ్ఛకు మురిసిపోతూ
విరగబడి ముప్పిరిగొంటూ
వెదజల్లుతున్నాయి
నీటి తుంపర్లును..!
ఒకనాడు-
బాధతో బరువెక్కి
రుజాగ్రస్తమయ్యాయి నా గుండెలు..
ఈనాడు-
నా కష్టాలన్నీ కడతేరాయి
చివరికి నాకిప్పడు తోడున్నది
జలమూ, అనిలమూ, నీలాకాశాలే..!
సూర్యతప్తమైన నా వదనం
ఎంత మనోజ్ఞంగా భావిస్తోందో..!
పురులు విప్పుకున్న నా కురులు
యథేచ్ఛగా పారాడుతున్నాయి
నా బాహువుల తీరాన..!
నీలి దూరాలు
నా ధవళ విహంగాన్ని
కబళించాయి.
ఎవరో సమీపిస్తున్న సవ్వడి...
అది నువ్వేనా ప్రియతమా..?
కడలీ..ఓ కడలీ..!
అంకురించింది ప్రేమ
నా ఎదలో...!!!

(ఈ కవిత ప్రఖ్యాత లిథుయేనియన్ కవయిత్రి సలమేయా నోరిస్ రాసింది. ఆవిడ లిథుయేనియన్ కోకిలగా పేరుగాంచింది. జననం-నవంబరు 17, 1904, మరణం-జూన్ 7, 1945.)

సా హి తి

నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం శీలా వీర్రాజు

దివికుమార్

సాధారణంగా మంచుకొండలా, నిండుకుండలా ఆవేశ కావేషాలు లేకుండా ఉండే శీలా వీర్రాజు ఆరోజు తనలోని ఆవేశాన్ని, దాచుకున్న భావాగ్నిని వ్యక్తం చేసిన సందర్భం.

అది 1996 జనవరినెల. బహుశా సంక్రాంతిరోజులు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రఖ్యాత రచయిత మధురాంతకం రాజారాంకు అప్పాజోస్యుల, విష్ణుభొట్ల ఫౌండేషన్‌వారు విశిష్టసాహితీ పురస్కారాన్ని అందజేస్తున్న సభ. సభ కిటకిటలాడుతోంది. సింగమనేని నారాయణ మధురాంతకం సాహిత్య విశిష్టతను సభాముఖంగా తెలియజేసిన తరువాత పురస్కార ప్రదాన కార్యక్రమానంతరం శీలా వీర్రాజును మాట్లాడమని నిర్వాహకులుకోరారు. తాను ఉపన్యాసకుడినికానంటూ మధురాంతకం సాహిత్యం గురించి నిరాడంబర వ్యక్తిత్వంగురించి రెండు మంచిమాటలు చెప్పి సమకాలీన సాహిత్యకారులలో అవకాశవాదం ఉందంటూ తన సాధారణపద్ధతికి భిన్నంగా విమర్శనాత్మకంగా మాట్లాడ సాగారు. విజయనగరంజిల్లా పేరుని విజయరామ గజపతినగరంగా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించటాన్ని తప్పుపట్టారు.

గురజాడ లాంటి గొప్ప సాహితీకారులు, ఇంకా అనేకమంది ప్రఖ్యాత కళాకారులుండగా పట్టించుకోకుండా తన వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం రాజుల రంగప్పల పేర్లు పెట్టడాన్ని సాహిత్యకారులు ఎందుకు చూస్తూ ఉంటున్నారు? జనసాహితిలాంటి వారు తప్ప మిగిలినవారు ఎందుకు ఖండించడం లేదు. కనీసం తప్పుపట్టడం లేదు? అది మనందరి బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. నిజానికి పైవిషయం అంటే విజయనగరం జిల్లా పేరు మార్పు గురించి పత్రికలలో వచ్చివున్నా చాలామంది దృష్టి దానిపై పడ్డట్టులేదు. ఆనాటికి సెల్‌ఫోన్లు, వాట్సాప్‌లు లేవు కదా!

జరిగింది ఏమిటి అంటే ఆయన వేదిక ఎక్కడానికి ముందు నాకు కనిపించినప్పుడు ఆ నెల ప్రజాసాహితి ఇచ్చాను. అందులో పై అంశంపై సంపాదకీయం ఉంది. నిజానికి అది సంపాదకీయం కాదు. కొద్ది మార్పులతో విజయనగరం జనసాహితి శాఖ విడుదల చేసిన కరపత్రం అది. దాన్ని రాసింది నేనే. అది ఎలా జరిగిందంటే...అంతకు కొద్దివారాల ముందు విజయనగరం జనసాహితి శాఖ ఏర్పాటుచేసిన ఒక బహిరంగసభలో మాట్లాడడానికి వెళ్లాను. ఆ సభలో జిల్లా పేరుని మార్చాలనుకుంటే అది గురజాడ లాంటి తెలుగు జాతి ప్రజాస్వామ్య సాంస్కృతిక వైతాళికుని పేరు పెట్టాలి కానీ రాజుల రంగప్పల పేర్లు పెడితే ప్రజా రచయితలు కళాకారులు ఆమోదించరని, అలాంటి ఆలోచనలను జనసాహితి ఖండిస్తోందని, "రాజుల సంస్కృతి ప్రజలది అంటే చెల్లదు చెల్లదు చెల్లదులే" అనే చెరబండరాజు కవితా వాక్కులను ఉటంకిస్తూ నా సహజ ఆవేశ ధోరణిలో మాట్లాడాను. సభ అయిపోయిన తర్వాత ఇద్దరు ముగ్గురు జర్నలిస్టులు, ఒక రచయిత నేను ఉన్న చోటుని వెతుక్కుంటూ ఈ అంశంపై కరపత్రం రాయాలని కోరగా రాసి ఇచ్చాను.



విజయనగరంలో బహిరంగసభ ఏర్పాట్ల దగ్గర్నుంచి కరపత్రం విడుదల దాకా నిర్మలానంద గారున్నారు. కరపత్రాన్ని జనవరి 1996 సంచికలో సంపాదకీయంగా ప్రచురించాం. అదే సభకు గుంటూరు నుంచి వచ్చిన పెనుగొండ లక్ష్మీనారాయణ మనం వెంటనే రచయితల సంతకాలతో కూడిన ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వానికి పంపుదాం రాసి ఇవ్వండి అని సంచిలో నుండి తెల్ల కాగితం తీసి ఇచ్చాడు. నేను అక్కడికక్కడ ఒక విజ్ఞాపన పత్రం రాసి, ముందు శీలా వీర్రాజుగారితో సంతకం పెట్టించి అక్కడినుంచి ఒక్కొరొక్కరే రచయితలతో సంతకాలు చేయించాము. దాన్ని పోస్ట్ చేసే బాధ్యత పెనుగొండ తీసుకున్నాడు. అప్పట్లో బాలగోపాల్ కూడా చంద్రబాబు వైఖరిని ఖండిస్తూ ఏదో పత్రికలో రాశాడు. కారణాంతరాలు ఏమైనా విజయనగరం జిల్లా పేరు మారలేదు.

గుత్తికొండ సుబ్బారావు చొరవతో మరొక నలుగురిని కలుపుకుని "స్పందన సాహితి" అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాము. 'స్పందన' అనే కవితా సంకలనం తీసుకురావాలని నిర్ణయించుకున్నాము. కవులకు ఉత్తరాలు రాసే బాధ్యత అంతా సుబ్బారావుది. వరవరరావు నుండి 'స్పందన' అనే కవిత వచ్చింది. అదే ముందు వేయాలని అనుకున్నాము. కుందుర్తి ఆంజనేయులుతో ఆ సంకలనానికి ముందుమాట రాయించాలని, శీలా వీర్రాజుతో ముఖచిత్రం వేయించాలని అనుకున్నాము. వీర్రాజు కూడా మా స్పందన సాహితి గదికి వచ్చేవారు. తక్కువ మాట్లాడే వారు కానీ వయసులో సాహిత్య రంగ ప్రవేశంలో చాలా చిన్నవాళ్ళం అయినా బాగా కలిసిపోయి ఉండేవారు. తర్వాత ఆలోచించుకుంటే స్పందన కవితా సంకలనానికి మా అందరి కంటే ఎక్కువ శీలా వీర్రాజు కృషి చేశారు అని అర్థం అవుతోంది. చిక్కడపల్లిలోనే వారి బంధువు ప్రెస్ ఒకటి ఉంది. అందులో మా కవితాసంకలనం ముద్రణ. వీర్రాజుతోపాటు నేనుకూడా ప్రెస్‌కి వెళ్ళేవాడిని. ప్రూఫులు ఆయన, సుబ్బారావు చూసేవారు. మా ఏడుగురిలో ఐదుగురుకవితలు ఆ సంకలనంలో వచ్చాయి. అందులో 'కార్మికుడా' అనే నేను రాసిన కవిత జీవితంలో మొదటిసారి వరవరరావు కవితతో పాటు కుందుర్తి, ఏబీకే ప్రసాద్‌లవి కూడా అందులో ఉన్నాయి. దానిపై విశాలాంధ్ర పత్రికలో ఉమారాజ్ పేరుతో సమీక్ష వచ్చింది. ఆయన నిడమర్తి ఉమా రాజేశ్వరరావు అని తర్వాతకాలంలో నేను తెలుసుకున్నాను.

వీర్రాజు ముఖచిత్రం గీసి ఇచ్చారు, ఒక ఎర్రటి సిరా చుక్క కాగితంపైపడి అన్ని వైపులకు విస్తరించుకున్నట్లు! బావుంది అనుకున్నాము. ఒక ఆదివారం సుబ్బారావు, శీలా వీర్రాజుతో పాటు నేను కూడా మలక్పేట ఎన్.జి.ఓ. కాలనీలో ఉండే కుందుర్తి ఆంజనేయులు ఇంటికి వెళ్ళాము. ఆయన చాలాసేపు మాట్లాడారు. వీర్రాజు నోటివెంట ఒక్క పరుష మైన వాక్యం కూడా వచ్చేది కాదు. అప్పటికే ఆయన రాసిన 'మైనా' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. ఎన్నో కథలు రాశారు. చిత్రాలు గీశారు కానీ ఇసుమంత కూడా ఆడంబరం లేకుండా, అప్పుడప్పుడే సాహిత్య రంగంలోకి కాలిడుతున్నమాలాంటి కొత్తకారుతో స్నేహసంబంధాలు కలిగి ఉండేవారు. అప్పట్లో కుందుర్తి, గోపాల చక్రవర్తి (గోల చక్రవర్తి పేరుతో పత్రికల్లో రాసేవారు) రాష్ట్ర ప్రభుత్వ సమాచారశాఖలో కలిసి పనిచేసేవారు. నాకు కాలేజీలో చదువుకునే రోజుల్లోనే ఈ సమాచారశాఖ వారు నడిపే ఆంధ్రప్రదేశ్ పత్రికతో పరిచయం ఉండేది. ఒకసారి మమ్ములను నిఖిలేశ్వర్ ఇంటికి వీర్రాజు తీసుకువెళ్లారు. ఆయన హిందీ పత్రికల్లో వచ్చిన తన వ్యాసాలు కూడా చూపించారు. ఒకసారి గుత్తికొండ సుబ్బారావుని నన్ను వీర్రాజు యువభారతి బృందం దగ్గరకు తీసుకువెళ్లారు. నాలో అప్పటికే విప్లవోత్సాహం ఉరకలేస్తున్న కారణంగా ఆ బృందం అంతగా నన్ను ఆకట్టుకోలేదు. ఆ తర్వాత వీర్రాజు సూచనలతో, స్పందన సాహితి పేరుతో మేము నిర్వహించిన మరొక సాహిత్య కార్యక్రమం, శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో 1970 జనవరి నెలలో దేవరకొండ బాలగంగాధర తిలక్ కవిత్వ సంకలనం "అమృతం కురిసిన రాత్రి" పై సాహిత్యగోష్ఠి. అరిపిరాల విశ్వం, శశాంకలతోపాటు కె.శివారెడ్డి కూడా ఆనాటి ఉపన్యాసకుడు. నన్ను బాగా ఆకట్టుకున్నవాడు శివారెడ్డి. అప్పటికే సంవేదనపత్రికలో రాచమల్లు రామచంద్రా రెడ్డి తిలక్ కవిత్వంపై రాసిన విమర్శనాత్మక వ్యాసం మేము చదివి ఉన్నాం. "తిలక్‌ను స్వాప్నికుడు అన్న రారా విమర్శపై మీ అభిప్రాయం ఏమిటి" అనే ప్రశ్నను చీటీ రూపంలో వేదిక మీదకు పంపించాము. దానికి జవాబు ఎవరు చెప్పారు? ఏం చెప్పారు? అనేది ఇప్పుడు నాకు గుర్తులేదు. 1970 ఫిబ్రవరి, విశాఖపట్నంలో జరిగిన శ్రీ శ్రీ షష్టిపూర్తి సభలో మొదటిసారి శీలా వీర్రాజు నిర్మలానందని కలిసారు. శ్రీ శ్రీ కవితలు కొన్నింటిని హిందీలోకి అనువాదం చేసి చిన్న పుస్తకం తీసుకు వస్తే దానికి ముఖచిత్రం వీర్రాజు వేశారు.

శీలా సుభద్రాదేవి ఆయనకు మేనమామ కూతురే! కానీ వారిది పెద్దలు కుదిర్చినపెళ్లి కాదు. వారిరువురు ఇష్టపడి చేసుకున్నది. సుభద్రాదేవి వీర్రాజు ఉత్తమ పాఠకురాలు. విమర్శనాదృష్టితో ఆమె ఆయన రచనలను పరిశీలించారు. వారిరువురి సాహిత్యఅభిలాష, అభిరుచి తమ తమ అభీష్టానుసారం వివాహం చేసుకునేట్లు పురి గొలిపింది. 1971లో అంటే 50 ఏళ్లకు పూర్వం వారి వివాహం అయిన తర్వాత సుభద్రాదేవి వీర్రాజు మొదటి పాఠకురాలు. ఆయన సాహచర్యంతో సహజీవనంతో తాను కూడా స్వయంకృషితో గుర్తింపు కలిగిన రచయిత్రిగా ఎదిగిన స్వతంత్ర వ్యక్తిత్వం సుభద్రాదేవిది. వారిద్దరిదీ ఎదుటివారిని నొప్పించకుండా మాట్లాడే అత్యుత్తమ కళాత్మక జీవనం. వీర్రాజు నిరాడంబరతలో నిజాయితీఉంది. స్నేహశీలతలో అంతులేని ప్రేమ ఉంది. సాటిరచయితల పట్ల సౌహార్ద్రతతో కూడిన అనురాగం ఉంది. ఆచరణలో గందరగోళం ఎరుగని స్పష్టత, తేటదనం ఉన్నాయి.

వ్యక్తిగత కీర్తి కాంక్షకు వెంట్రుక వాసి విలువ కూడా ఆయన ఎప్పుడూ ఇవ్వలేదు. సాహిత్యానికి కళలకు సామాజిక ప్రయోజనం ఉండి తీరాలనే బలీయమైన ఆకాంక్ష ఆయనలో ఉంది. అందుకే ఆయన రచయితలకు కళాకారులకు ఆదర్శనీయుడు. ఒక ఉత్తమ నమూనా.

నేనూ-తులసిగారూ

శ్యామ్ చిర్రావూరి

నేనే రాసిందేదైనా నాతోనే మొదలవుతుంది. నాతోనే నడుస్తుంది. ఇదీ నామీద ఆరోపణ. బహుశా నిజం కూడా. ఇది తులసిగారి మీద రాయడానికి నా ప్రయత్నం . ఇది కూడా దానికి ఎక్సెప్షన్ కాదు. గనకనే ఇది 'నేనూ-తులసిగారూ' అయింది.

నేను తులసిగారిని మొట్టమొదటిసారి ఎప్పుడు కలిసేను? బహుశా 70ల తొలినాళ్లలో కలిసేననుకుంటాను. హుషారుగా, ఉత్సాహంగా, నవ్వుతూ, తుళ్ళుతూ, ఆరోగ్యంగా ఆవిడ అప్పటి రూపం ఇప్పటికీ నాకు స్పష్టంగా కనిపిస్తోంది. ఆశ్చర్యం ఏమిటంటే, ఆరోగ్యం మాటెలా ఉన్నా, ఇపుడు కూడా ఆవిడ హుషారుగా, ఉత్సాహంగా, నవ్వుతూ, తుళ్ళుతూనే వున్నారు.

ఆ మొదట్లోనే ఓ రోజు ఎందుకో సరదాగా నా చెయ్యి చూసేరు. లేక నేనే చూడమన్నానో. "నీకు పెళ్ళి ఆలస్యంగా జరుగుతుంది" అన్నారు.

నేను వెంటనే మరి మీకో అన్నాను కొంటెగా.ఆవిడ కోపగించుకోలేదు. 'హన్నా!' అన్నట్టుగా నవ్వుతూ "నాకిప్పుడు జరిగినా ఆలస్యమే" అన్నారు. ఆ కోపగించుకోకుండా నవ్వుతూ తగిన జవాబివ్వడంలోనే ఆవిడ విలక్షణ వ్యక్తిత్వం వుందని నాకు ముందు ముందు తెలుస్తుంది.

నాతో స్నేహంగా, అభిమానంగా వుండేవాళ్ళు. ఇంకా ఇప్పటిదాకా ఆ స్నేహం అలా నిలిచి వుండడానికి కారణాలాయా మనుషులే. నేను స్నేహాలు చేసుకోలేను. గట్టిగా నిలుపుకోనూ లేను. స్నేహం చూపించేవాళ్ళ పట్ల స్నేహభావంతో వ్యవహరించగలను. అంతే! తులసిగారు చేరదీయడం వలనే నేను చేరికగా వుండగలిగేను. ఆ తర్వాత ఆవిడ విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో ఎమ్. ఫిల్. చెయ్యడానికి వచ్చినపుడు భరాగో (భమిడిపాటి రామగోపాలం) ఇంటికి దగ్గరలోనే 'పామ్ గ్రోవ్' లో ఒక గదిలో అద్దెకు వుండేవారు. నేను ఆంధ్రా మెడికల్ కాలేజ్ హాస్టల్లో వుండేవాడిని. ఆ 'పామ్ గ్రోవ్' ఇల్లు / గది మా హాస్టల్ కి చాలా దగ్గర. అంచేత తరచుగా అక్కడికి వీలయినప్పుడల్లా వెళ్ళేవాడిని. సాహిత్యం కబుర్లు, హిందీ భాషా, హిందీ పాటలూ, వాదనలూ, కబుర్లు చెప్పడం, కొద్దిగా వినడం ఇవన్నీ ఆకర్షణలు.

ఆవిడ రాసిన 'బొమ్మరూపాయి' చాలా ప్రశస్తి పొందింది. ఆ కథని NBT వాళ్ళ Masterpieces of Indian Literature: Volume3 Editor- K.M. George, NBT, India 1997 లో మెన్షన్ చేసేరు. నాకు 'మాంజా'దారం అనే కథ బాగా నచ్చింది. అది 1955లో ఆంధ్రపత్రికలో వచ్చింది. అంత చిన్న వయసులో అంత మంచి కథ రాసినట్టుగా నా కన్పించేది. కాని ఎవరి గురించి, ఎవరిని లేక ఏమిటి చూసి రాసేరని నాకన్పిస్తూవుంటుంది. కాని ఎప్పుడూ అడగలేదు.

1982లో అనుకుంటాను తులసిగారు ఏదో గ్రాంటుమీద ఉత్తరభారతదేశంలో సాహితీ ప్రముఖుల్ని కలవడానికి చాలాచోట్లకి వెళ్ళేరు. లక్నోలో మా నాన్నగారిని కలిసేరు. ఏంకావాలంటే ఆయన వక్కపొడి తెమ్మన్నారట. ఈవిడ వక్కపొడి తీసుకెళ్ళేరట. ఢిల్లీలో ఆవిడ భార్గవగారింట్లో గుల్ మొహర్ పార్క్ లో వుండే వారు. నేనూ, ఆవిడా వుదయం నించీ సాయంత్రం దాకా ఎక్కడెక్కడో తిరిగి తిరిగి ఎవర్నెవర్నో కలుసుకుని సాయంత్రం/ రాత్రి ఆవిడ్ని గుల్ మొహర్ పార్క్‌లో దిగబెట్టేసి నేను నా గదికి చేరేవాణ్ణి. సౌత్ ఎక్స్టెన్షన్‌లో కైలాష్ వాజపేయినీ, రాజోరీ గార్డెన్‌లో ఎవరో యూపీవాళ్ళనీ కలిసేం. వాళ్ళంతా ఆవిడతో, 'మీది చాలా మంచి హిందీ. చాలా బావుంది. వింటూ వుంటే సంతోషంగా వుంది' అనేవాళ్ళు. కానీ ఢిల్లీలోనో లేక ఉత్తర భారతదేశంలో ఎక్కడవున్నా వుండి వుంటే- అన్పిస్తుంది నాకు అప్పుడప్పుడు. ఆరోజుల్లో అవడం వల్ల, మహిళ కావడం వల్ల ఆవిడ సుదూర తీరాలకి పోలేకపోయారేమో అన్పిస్తుంది. అయినా మరో రాష్ట్రంలో ఉద్యోగం చెయ్యడానికి నిశ్చయించుకుని ఒరిస్సాలో చేరారు, ఆవిడకి ఆంధ్రాలో గవర్నమెంటు ఉద్యోగం వచ్చినా కూడాను. ఇది ఒక విధంగా మంచిదే అయింది. ఒరియా భాష మీద పట్టూ, ఉత్తరోత్తరా చాలా మంచి ఒరియా రచయితల రచనలని పరిశీలించడానికీ, పరిశోధించడానికీ, అనువదించడానికి చక్కటి అవకాశం కలిగింది.

ఆ 1982లో తులసిగారు. ఢిల్లీలో వున్నప్పుడే రాచకొండశాయి బొంబాయినుండి వచ్చేడు. అతన్ని కూడా తీసుకుని మేము మోతీబాగ్ లో వున్న ఇలపావులూరి పాండురంగారావు గారింటికి వెళ్ళేం. ఆయన స్కాలరు, పండితుడు, బహుభాషాకోవిదుడు. 'పోతన' ని హిందీలోకానికి పరిచయం చేసిన ప్రతిభావంతుడు. అదికాక అప్పట్లో సత్యసాయిబాబా గారికి పర్సనల్ అనువాదకుడు. భక్తుడు (తర్వాత కాదు). ఈ మెరుపుల వెలుగుల్లో ఆయనకి, చిన్న, కాదు చిన్నవారేమిటి ఎలాటి గొప్పవారూ కనబడేవారు కాదు. నాది 'అది ఒక స్థితి' అని తెలియని పరిస్థితి. ఎందుకో ఆయనకి డాక్టర్లంటే చిన్నచూపో ఏమో, కనీసం అలా వుంది ఆయన ప్రవర్తన. నా దృష్టిలో చాలా ప్రతిభావంతులైన కవులనీ, పండితులనీ అలా తీసిపారేస్తూ, అలాగే నన్నుకూడా తీసి పారెయ్యడం కొంత సేపుకంటే ఎక్కువ సేపు సహించడం సాధ్యం కాలేదు. ఫ్లాష్ పాయింట్ ఆయన డాక్టర్లకి కవిత్వమేమిటి? సెన్సిటివిటీ ఏమిటి? అన్నచోట వచ్చింది. పైగా, కామా సెమికోలన్లలా బాబాగారు, బాబాగారు అంటున్నాడు ఆయన. అప్పటి నా సోకాల్డ్ అభ్యుదయపథంలో సత్యసాయిబాబాగారికి ఉచిత స్థానం లేదు.

కొన్ని విషయాలు పూర్తిగా వివరించకపోతేనే బాగుంటుంది. మా ఇద్దరి డ్యూయల్ లో ఆయన పెద్దవాడు. కాబట్టి నాతో ఉద్ధృతంగా వాదులాడలేదు. ఇంటికి వచ్చిన అతిథిని ఏమీ అనలేదు. కనుక ఆ పెద్దాయనే కొంచెం తగ్గేడు. పైగా ఇది డైనింగ్ టేబుల్ పై జరిగింది. ఇలాంటి ఉపద్రవంలో కూడా తులసిగారు శాంతంగా వున్నారు. మౌనంగా చూస్తూ, వారించలేదు, నివారించలేదు. రాచకొండశాయి కూడా తన బెస్ట్ బిహేవియర్‌లో వున్నాడు. అంటే నన్నేమనలేదు. ఆపలేదు.

ఒకసారి ఆజాద్ భవన్‌కీ, మరొకసారి ఆంధ్రప్రదేశ్ భవన్‌కి వచ్చారు. చాసోగారి కథల్ని పుస్తకంగా ఇంగ్లీషులో పెంగ్విన్ ద్వారా తేవాలనే ప్రయత్నాలలో వుండేవారు. ఆ సందర్భంగానే శ్రీ వేంకటేశ్వర కళాశాల ప్రొఫెసరు పాండురంగారావుగారింటికి ఒకసారీ, మరొకసారి సుజన్ సింగ్ పార్క్ లోవుండే కుష్వంత్ సింగ్ గారింటికి వెళ్ళాం. నేను కుష్వంత్ సింగ్ గారింటి బయటే వుండిపోయాను. తులసి గార్ని ఓ సాహిత్య మిత్రుడు కుష్వంత్ సింగ్ గారి దగ్గరికి ఇంట్లోకి తీసుకు వెళ్ళాడు. నేను బయటే వుండాలని ఆ సాహితీ మిత్రుడు కండిషన్ పెట్టాడు. మనకి పని ముఖ్యం అని బయటే వున్నా.

ప్రయత్నాలెన్నున్నా ఎలా వున్నా ప్రాప్తమున్న తీరానికి పడవసాగిపోతుంది. చేరిపోతుంది. నేనీ అమెరికా వచ్చింతరువాత దాని గురించే కనుక్కోమనీ, నారాగారిని అడగమనీ ఫోన్ చేశారు తులసి గారు. నేను నారాగారికి ఫోనూ మెయిలూ చేసీ, ఇచ్ఛీ, మెసేజి పెట్టేను. తులసి గారిని కాంటాక్ట్ చెయ్యమనీ, మాట్లాడమనీ. ఆయన మాట్లాడేరు. పుస్తకం వచ్చింది.

పెంగ్విన్ వాళ్ళు వేసేరు: A Doll's Marriage and Other Stories. అనువాదం వెల్చేరు నారాయణరావు మరియు డేవిడ్ షుల్మన్. అంతేకాదు, 'కథలను ప్రేమించే చాగంటి తులసి కోసం' అని అంకితం కూడా ఇచ్చేరు.

అనువాదాలు తులసిగారు ఎన్నో చేసినా, కొన్నిటి గురించి నేను చూసినవీ, అనుకున్నవీ రాస్తాను. మహాదేవివర్మ గీతాలు ఆవిడ అనువదించేరు. దాంట్లో మహాదేవివర్మ వేసిన చిత్రాలు కూడా కలిపి ప్రచురించేరు. దానిమీద ఆవిడ కోరికమీద నేను ఇంగ్లీషులో ఒక వ్యాసం రాసేను. దాంట్లో మహాదేవివర్మ వంటి కవయిత్రిని అనువదించడంలో వున్న ఇబ్బందుల్నీ, కష్టాల్నీ, నా అవగాహనమేరకు చెప్పేను. సంస్థలు చెయ్యవలసిన పనులని వ్యక్తులు చెయ్యడం సామాన్యవిషయమేమీ కాదు. తన రోజుల్లో మహాదేవివర్మ చేసినటువంటి పనులనే తన సమయంలో తులసిగారు కూడా చేసేరని, చేస్తున్నారని నా వుద్దేశ్యం. మహాదేవివర్మ మీద ఆవిడకున్న గౌరవం, ఇష్టం గమనించేను. మనదేశంలో ఎంత గొప్పవారికైనా ప్రభుత్వ గౌరవాలు అందడంలో ఆలస్యం కావడం సహజం. మహాదేవివర్మకి జ్ఞానపీఠ్ అవార్డు రావడంలో జరిగిన విలంబానికి ఆవిడే విధంగా తీసుకున్నారో నాకు తెలియదుగాని, తులసిగారు కొంతలో కొంత బాధపడ్డారనే చెప్పాలి.

అనువాదప్రక్రియలో ఇంత కృషిచేసిన తులసిగారికి అనువాదానికై సరి తగిన అవార్డు రాకపోవడం ఈ ప్రోసెస్ లో వున్న లోపాలనే చూపిస్తుంది. ఆవిడని అనువాదాలకి సెలెక్షన్ మెంబర్ని చేశారు. ఆవిడ తన కర్తవ్యాన్ని చక్కగా దిగ్విజయంగా నిర్వహించేరు. నేను చాలా ఏళ్ళ క్రితం ఎప్పుడో చిన్నప్పుడే నా కథలు అనువాదం చెయ్యొచ్చుగా అనో, చెయ్యండి అనో అడిగాను.ఆవిడ చేస్తాను. ముందు నాన్న, తర్వాత మరికొందరు. నువ్వూ వున్నావు నా లిస్ట్ లో అన్నారు.

ఒకటి రెండు కథలు చేసినా, 'తెలుగుకీ శ్రేష్ఠ కహానియా' 12 అనువాద కథల పుస్తకంలో నా కథ చేర్చినా, నిజంగానే నా కథల్ని అనువదిస్తారను కోలేదు. నిజానికి ఆవిడ నా కొకసారి ఫోన్ చేసి ఏదో ఒక కథలో ఆవిడకి కలిగిన అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నించినపుడు, వద్దనే అన్నాను. అతి కష్టం మీద ఆ తెలుగు కథల పుస్తకం వచ్చింది. ఇప్పుడు మళ్ళీ వీట్ని అచ్చు వెయ్యడం, పుస్తకంగా తేవడం అన్ని కష్టమే, వద్దన్నాను.

ఆవిడ నిన్ను సలహా అడగలేదు. అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పు అన్నారు. నే వేసుకుంటా, నే చూసుకుంటా అన్నారు. మాటల్లో అర్థమైనదేమిటంటే, అప్పటికే ఆవిడ 8 కథలదాకా అనువదించేరు. మరో నాలుగు కలిపి 12 పూర్తి చేద్దామనుకున్నారు. చేసేరు. 'రాగ్ మాలిక' పూర్తిచేసేరు.

ఉర్దూ, హిందీ కాని, రెండూ కలసిమెలసిన హిందూస్థానీ ఆవిడకిష్టం. అది ప్రజల భాష, మతసామరస్యమైన భాష. నా కథలకి సరిపోతుందనీ, సరితూగుతుందనీ, భావించి ఆవిడ అలాంటి భాష వాడేరు. హిందీ భాషీయులు సంస్కృతీకరించిన హిందీనే ప్రామాణికంగానూ, సముచితంగానూ భావిస్తారని తెలిసినా పట్టించుకోలేదు.

అనువదించినపుడూ, ప్రూఫ్ రీడింగులోనూ ఆవిడ శ్రద్ధ, పెర్ ఫెక్షన్ గురించిన తపనా నా స్వంత అనుభవం ద్వారా తెలుసుకున్నాను. తప్పులు రాకుండా వుండాలనే దృష్టితో ఆవిడ కొన్ని గంటలు ఆ డిటిపి చేసే అమ్మాయి పక్కన కూర్చుని చేయించేరు, విజయనగరం నుండి విశాఖపట్నం వెళ్ళి మరీ. నా పుస్తకమనే కాదు. ఏ పుస్తకమయినా అంతే శ్రమ పడతారు. 'నీ ఉత్తరం అందింది' అనే చాసో గారి మిత్రుల ఉత్తరాలు కూర్చినపుడు కూడా ఫ్రెంచి మొదలైన ఇతర భాషాపదాలూ, పేర్లూ, ఏవీ తప్పు రాకూడదని ఎంత కష్టపడ్డారో మాటల్లో చెప్పలేను. ఆ మధ్య ఒకసారి ఫోన్‌చేసి ఆరుద్రగారు రాసిన 'అప్పలస్వామిగారూ' అనే కవిత కావాలన్నారు. కొంచెం కష్టపడి వెతికి పంపేను. అదికూడా ఆ కవితలో వాడిన కొన్ని పదాలూ, పేర్లూ సరిగా రాసేనో లేదో తను రాసిన వ్యాసంలో అని చూసుకోవడానికి.

ఇంత శ్రద్ధగా ఏ పనైనా చేస్తారు కాబట్టే నా అశ్రద్ధమీద ఆవిడకి కోపం. నేను చెయ్యగలిగిన (చెయ్యగలనని ఆవిడ అనుకుంటున్న) చాలా పన్లు, రాయడం వగైరాలు, నేను చెయ్యడం లేదని. ఉన్న (నిజానికి అంతగా లేని) ప్రతిభని నేను సరిగా వుపయోగించడం లేదని.

ఒకసారి రవీష్ కుమార్ ఫేస్ బుక్ లో రాసి పబ్లిష్ చేసిన లప్రేక్ (లఘు ప్రేమ్ కహానియా) పుస్తకం కావాలన్నారు. నేను ఆస్ట్రేలియా నుండి ఎవరో చేసిన డీటెయిల్డ్ రివ్యూ మాత్రం పంపగలిగేను. కాని ఆవిడ ఆ పుస్తకాన్ని సంపాదించేరు.

అహమ్మదాబాదునుంచి ఒకాయన ఇంగ్లీషులో పాత హిందీ పాటలమీద రాసిన ఓ పుస్తకాన్ని వి.ఎ.కె రంగారావుగారి ద్వారా తెప్పించేరు నాకిద్దామని.

నన్నెప్పుడూ కథలపుస్తకం వెయ్యవా? ఆమాత్రం డబ్బులేదా నీ దగ్గర అని అడుగుతుండేవారు. నేను వేద్దామనే నిర్ణయానికి వచ్చినపుడు

ముందుమాట రాయమంటే రాయనన్నారు. మీరు రాయకపోతే ఎవరు రాస్తారు అన్నాను. రాసేరు. కొంచెం ఎక్కువమార్కులు వేసినట్టున్నారు. అంటే ఏంలేదు, తగినమార్కులే వేసేను, నేను ఎక్కువమార్కులు వేయను అన్నారు.

ఒక పెద్దాయన నా కథలు బావులేవన్నాట్ట. ఆవిడ చెప్పేరు. పోన్లెండి. అన్నీ అందరికీ నచ్చాలని లేదుగా అన్నాను.

కొన్నాళ్ళకి ఆవిడ సడన్‌గా ఓ రోజు ఫోన్‌చేసి, నేను నీకు తప్పు చెప్పేను. ఇవాళ ఆయన అన్నాడు, శ్యామ్ కొన్ని చాలా మంచి కథలు రాసేడని. నేను నీకు తప్పుగా చెప్పేసేను అన్నారు.

పోనీలెండి. అతను ముందర వెలిబుచ్చిన అభిప్రాయం తప్పో, ఇప్పటి ఈ అభిప్రాయం సరియైందో తెలీదు కదా! ఏమైన అన్నీ అందరికీ నచ్చక్కర్లేదు కదా! అదీ ఆవిడ నిజాయితీ, సిన్సియారిటీ. మనం అన్ని విషయాల్లోనూ ఆవిడతో ఏకీభవించనక్కరలేదు. ఎవరూ ఎవర్తోనూ నూటికి నూరుశాతం ఏకీభవించలేరు. కాని ఆవిడ రచనల్లో నిజాయితీ వలన నిండిన సౌరభాలూ, వ్యాపించే పరిమళాలూ మాత్రం వుంటాయి.

ఆవిడ వచనమే ఎక్కువరాసినా, కవిత్వంపట్ల ప్రత్యేకమైన ఆకర్షణ వుంది. ప్రకృతిపట్లా అటువంటి ఆకర్షణే వుంది. 'రంగంటే ఇష్టం', 'వెన్నెల', ఇంకా కొన్నికథల్లో పూలవర్ణనలూ, ఉదాహరణలూ, ఈ విషయాన్ని నిరూపిస్తాయి. కవిత్వం పట్ల ఆకర్షణే ఆవిడచేత కొన్ని కూనలమ్మ పదాలూ రాయించింది. మఖూం మొహియుద్దీన్ రచన - ఏక్ చంబేలీ కే మండ్ వే తలే- (చాచాచా 1964 సినిమాలో రఫీ, ఆశా పాట) ని అనువదింపజేసింది ఆ మధ్య.

ఆవిడకి ఇంకా ఇంకా చదవాలనీ, తెలుసుకోవాలని వుంది. ఉత్సాహంగా, హుషారుగా, చురుగ్గానే వున్నారు. శరీరం ఇంకా చాలాకాలం సాయం చేస్తుందని ఆశిస్తున్నాను.

'వో సుబహ కభీతో ఆయేగి, వో సుబహ కభీతో ఆయెగీ' అన్నాడు సాహిర్. ఆయన అలా ఎందుకన్నాడో గాని 'సుబహ్ జరూర్ ఆయెగీ. సుబహ్ కా ఇంతజార్ కర్ ' అన్నాడు జాన్ నిసార్ అఖ్తర్. 'మానవాళికి మంచికాలం రహిస్తుందా? నిజంగానే... నిజంగానే' లాంటి సంశయాలేం లేవు తులసి గారికి. ఆవిడ నిస్సందేహంగా ఆశావాది. మాలాంటి ఎగ్నోస్ట్ కాదు. స్పష్టత ఆవిడ విశిష్టత. ఆఖరిగా, తరక్కీ పసంద్ అభ్యుదయ సాహిత్యవేత్త ఆవిడ.

శీర్షిక నుండే ఆలోచనల్లో పడవేసే 'భూమి రంగు మనుషులు'

గ్రంథ సమీక్ష

ఇది కెక్యూబ్ వర్మ నాలుగో కవితాసంపుటి ఇది. పదిహేనేళ్ల క్రితం 'వెన్నెల దారుల్లో' ప్రయాణించి, 'రెప్పల వంతెన' మీదుగా 'కాగుతున్న రుతువు' లోంచి 'భూమి రంగు మనుషులు' ను రూపొందించారు. మొత్తం 70 కవితలున్న ఈ కవితా సంపుటిలో కవిత్వం పొంగిపొర్లుతోంది.

మొదటి కవిత 'దుఃఖం' శీర్షికలోనే కవిత్వ ప్రవాహం ఎలా ఉందో చూడండి. 'కొన్ని వాక్యాలకు ఫుల్ స్టాపులుండవు/ కొన్ని పరిచయాలకు ముగింపులుండవు/కొన్ని గాయాలు చికిత్సకు అందవు/కొన్ని కరచాలనాలు మరపురావు/ కొన్ని మాటలకు శబ్దం ఉండదు/ కొన్ని పాటలు గొంతు దాటిరావు/ కొన్ని క్షణాలు ఊపిరినిస్తాయి/ కొన్ని సమయాలు పరిమళిస్తాయి/ కొన్ని జీవితాలు దుఃఖాంతమవుతాయి/ చివరిగా తడి అంటిన పూలు సమాధిని తాగుతాయి' ఇలా పిల్ల కాలువ లాంటి ఒక్కో పుటలోని కవిత్వం ప్రవాహమై, నది అయ్యి, సముద్రంగా అవతరిస్తుందీ సంపుటి. మౌన సంభాషణ కవితలో కవిత్వం ఇలా కారుతుంది-'ఒక్కో కల ముక్కలు అవుతూ/ గాజు గిన్నెలో ఇన్ని నూనె చుక్కలు',... 'నీళ్లు' అనే కవితా శీర్షికలో కడవల కొద్దీ నీళ్ళు/ కలలో కళ్లలో/.. నదిలో పాదాలు/ మండుతూ ఇసుకలో' ఇప్పుడు మనకిలేనిదాన్ని కవి కవిత్వంలో ప్రతిబింబంగా చూపిస్తాడు. ఈ కవితలో ఒక్కొక్క అక్షరాన్ని ఒక్కొక్క పాదం కింద మలిచి పదప్రయోగం కూడా చేస్తాడు.

అలాగే 'ఒక నిమిషం' కవితలో ఒక్క అక్షరం ఒక పాదంగా చేసి పాద ప్రయోగం చేస్తాడు కవి. కవిత్వంతో ఆడుకున్నట్టు అక్షరాలతోనూ, పదాలతో కూడా కవి ఆడుకోవడం, ప(పా)ద ప్రయోగం చేయడం, ఇది సాధారణంగా కనిపించదు. ఇది అవసరమా, అనవసరమో... అప్రయోజనమో.. ఇది కవి సరదామాత్రమే. కవిత్వంతో ఈ సంపుటిలో మొత్తం ఇలాగే ఆడుకుంటుంది అని అనుకోనక్కర్లేదు. 'భూమి రంగు మనుషుల్లో' 'వివక్ష నేడు ఆగ్రహ జ్వాలగా మారి/ నిన్ను నేలమాళిగలోకి నెట్టి వేస్తోంది' అని హెచ్చరిస్తాడు. రైతుకు నమస్కరిద్దాం అంటాడు.. రైతంటే ఈ నెలలోంచి/ మొలకెత్తిన అన్నం మెతుకు/ ప్రకృతిలో కలగలిసి ఎదిగే పచ్చనిరుతువు' అని తనదైన శైలిలో కవిత్వంగా అభివర్ణిస్తాడు. అలాగే సందర్భాన్నిబట్టి కాలాన్ని కూడా రికార్డ్ చేస్తాడు.. కామ్రేడ్ వరవరరావుకు బెయిల్ తీర్పు చూశాక 'అందని ఆకాశం' ఎలాగుందో చూపిస్తాడు. యుద్ధానికి ఆవల ఎలాగుంటుందో చూపిస్తాడు. ఈ సంపుటి చదువుతున్నంతసేపు పాఠకుడు కవితా సాగరంలో ఊగుతూ..పరవశిస్తూ..మునకలతో...తేలియాడుతూ ఉంటాడు. ఫలాన వస్తువుని స్వీకరించి ఫలానా కవిత రచించాడు అనేకంటే, వస్తువుని కవిత్వంలో ముంచి పాఠకుణ్ణి ఎటెటో తీసుకుపోయాడు అనవచ్చు. చివరికి చిన్న కవితలో కూడా దృశ్యాన్ని కవిత్వం చేశాడు- 'ఒక మాట/ఒక గొంతు/ ఒక చిగురాశను కలిగిస్తాయి కదా?/ ఎక్కడైనా ఒక పిడికిలెత్తిన దృశ్యం/ అపురూపం అవుతుంది కదా' అంటూ ఒక మాట ఒక గొంతు ఒక మహా దృశ్యం అవుతుందనే విషయాన్ని చిన్న కవితలో కూడా అద్భుతంగా పండించాడు కెక్యూబ్ వర్మ. తెలుగు కవితాశీర్షికలకి ఆంగ్ల పదాలు పెట్టడం అన్నది సరైనవిధానం కాదేమో. ఈమధ్య ఒక విమర్శావ్యాసంలో పేర్కొన్నట్టు ..తెలుగు కవితలకు ఇంగ్లీష్ పదాలు పెడుతున్నారు కదా...మరి ఇంగ్లీష్ కవులు తమ కవితలకు తెలుగు పదాల శీర్షికలు పెడతారా? అన్నది ఒకప్రశ్న ?...అసలు ఆంగ్లపదాలకి సరిపడ తెలుగు పదాలు లేవా? అర్థాలు కాన రావా ? అన్నది కూడా ఆలోచించవలసిన సందర్భం. ఈ విమర్శను కవులందరూ గమనించాలి, దృష్టిలో పెట్టుకుని పరిగణనలోకి తీసుకోవాలి.

-చలపాక ప్రకాష్,
సెల్. 92474 75975

భూమి రంగు మనుషులు
(కవితా సంపుటి)
రచన: కెక్యూబ్ వర్మ, పేజీలు:128,
వెల: వంద రూపాయలు,
ప్రతులకు: కె కె కె వర్మ,
ఇంటి నెంబర్ 11-3-11,
కె పి ఎం. హై స్కూల్ వెనక,
పార్వతీపురం 535 501

యువత జీవితాలతో ఆడుకోవద్దు...

అగ్నిపథ్ రద్దు చేయాల్సిందే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కొత్త సైనిక నియామక ప్రణాళికను తీసుకురావడం ద్వారా మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని, ఈ తుగ్లక్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. ఇరవై మంది సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు అధికార ప్రతినిధులు అనేక నగరాల్లో 'అగ్నిపత్ కి బాత్ యువోన్ సే విశ్వాస్‌ఘాట్' పేరుతో విలేకరుల సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. జాతీయ భద్రతకు ప్రమాదమని తక్షణమే ఈ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. "చర్చ లేకుండా బుల్డోజ్ చేసిన" ఈ "యువ వ్యతిరేక, దేశ వ్యతిరేక" పథకానికి వ్యతిరేకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో దేశవ్యాప్త నిరసనను కూడా నిర్వహిస్తామని కాంగ్రెస్ తెలిపింది. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి శక్తిసిన్హ్ గోహిల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ యువతకు అండగా నిలుస్తోందని, ఈ తుగ్లక్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. 14వ శతాబ్దంలో కొద్దికాలం పాటు ఢిల్లీ సుల్తానేట్‌ను పాలించిన మహమ్మద్ బిన్ తుగ్లక్ తన వివాదాస్పద నిర్ణయాలకు ప్రసిద్ధి చెందాడు. 'చైనా మన సరిహద్దుల్లోకి ప్రవేశించిన తరుణంలో.. ఇది (అగ్నిపథ్ పథకం) దేశ భద్రతతో ఆడుకున్నట్లే' అని గోహిల్ అన్నారు. అగ్నిపథ్‌ను ఉపసంహరించుకోవాలని, అగ్నిపథ్ పథకం బాగుందని చెబుతున్న మంత్రులు లేదా బీజేపీ అధికార ప్రతినిధులందరూ తమ కుమారులు, కుమార్తెలను అగ్నిపథ్ పథకం కింద చేర్చుకోవాలని నేను ప్రధానిని కోరుతునా అని అన్నారు. గోహిల్ తన పార్టీ కార్యాలయంలో భద్రతా ఉద్యోగాల కోసం 'అగ్నివీర్'లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిన బీజేపీ నాయకుడు కైలాష్ విజయవర్గీయ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'అగ్నివీర్లను బీజేపీ కార్యాలయాల్లో గార్డులుగా నియమిస్తామని చెప్పిన నాయకుడిని ప్రధాని తొలగించాలని, ప్రధాని క్షమాపణలు చెప్పాలి' అని గోహిల్ డిమాండ్ చేశారు. జైపూర్‌లోని పీసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, హర్యానాకు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి దీపేందర్ సింగ్ హుడా కూడా అగ్నిపథ్ పథకంపై కేంద్రంపై దాడి చేశారు ముసాయిదా విధానాలకు విదేశీ దేశాల నుండి ఆలోచనలను దిగుమతి చేసుకున్నందుకు ప్రభుత్వాన్ని "కాపీక్యాట్" అని అన్నారు. ప్రభుత్వం 'నకల్చి బందర్ (కాపీక్యాట్)' వైఖరిని అవలంబించింది, అయితే ఇది హిందుస్థాన్. కొన్నిసార్లు ఇది వ్యవసాయ చట్టాల సందర్భంలో అమెరికాను ఉదాహరణగా చూపుతుందన్నారు.

పళనిస్వామి క్యాంపునకు ప్రజలే బుద్ధిచెబుతారు: పన్నీర్ సెల్వం

మదురై(తమిళనాడు): ఎడప్పాడి పళనిస్వామి క్యాంపు పెట్టడాన్ని ఏఐఏడీఎంకే నాయకులు ఓ పన్నీర్ సెల్వం ఖండించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు నావే ఉన్నారు. నియంతలకు ప్రజలు, కార్యకర్తలే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. 'పార్టీ కార్యకర్తలంతా నావైపే ఉన్నారు' అని పన్నీర్ సెల్వం (ఓపీఎస్) అన్నారు. తాను కూడా కేడర్‌కు అండగా ఉన్నానన్నారు. ఢిల్లీని వచ్చిన పన్నీర్ సెల్వం తన సొంత జిల్లా అయిన తేనికి వెళుతున్న సమయంలో ఆయన మద్దతుదారులు ఘనంగా స్వాగతం పలికారు. కో-ఆర్డినేటర్ పదవి నుంచి తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న పళనిస్వామి చర్యలను ఆయన ఖండించారు. ఈ కుట్ర కోణానికి సంబంధించి ఎవరికీ సంబంధాలున్నాయో వారినెవ్వరినీ వదలననీ, ప్రస్తుత పరిస్థితికి ఆయన వైఖరే కారణమని విమర్శించారు.

ముగ్గురు ఐటీ అధికారులపై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ: సీనియర్ అధికారుల సిస్టమ్ యాక్సెస్‌ను దుర్వినియోగం చేయడం ద్వారా అనేకమంది పన్ను చెల్లింపుదారులకు టీడీఎస్ మినహాయించిన కల్పిత రీఫండ్ సదుపాయం కల్పించారన్న ఆరోపణలకు సంబంధించి ముగ్గురు ఆదాయపు పన్ను శాఖ అధికారులపై సీబీఐ దర్యాప్తు ప్రారంభించిందని అధికారులు ఆదివారం తెలిపారు. ముజఫర్‌నగర్‌లోని జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. ఈ ముగ్గురు గ్రూప్-సి ఐటీ అధికారులు కల్పిత రీఫండ్‌లను రూపొందించడానికి మదింపు అధికారుల ఆర్ఎస్ఏ టోకెన్‌లను దుర్వినియోగం చేసి డిపార్ట్‌మెంట్‌ను మోసం చేశారని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. ఎఫ్ఐఆర్ నమోదు తర్వాత సీబీఐ వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిందని వారు తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఈ కేసుకు సంబంధించి రీఫండ్స్ పొందిన తొమ్మిది మందితో పాటు ముగ్గురు ఐటీ అధికారులు-అభయ్ కాంత్, సౌరభ్ సింగ్ , రోహిత్ కుమార్‌లను నిందితులుగా పేర్కొంది.

దుండగుల కాల్పుల్లో రైతు మృతి

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ జిల్లాకు చెందిన పుగానా గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో 42 ఏళ్ల రైతు మృతి చెందారు. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఈ దారుణం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. మృతి చెందిన రైతును సత్యేంద్ర కుమార్‌గా గుర్తించినట్టు ఏరియా సీఐ శరత్ చంద్ర శర్మ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా విషయం తెలిసిన గ్రామస్తులు, రైతు సత్యేంద్ర కుమార్ కుటుంబ సభ్యులు గ్రామం సమీపంలోని మీరట్-కర్నాల్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. రైతు హత్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితులను తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను డిమాండు చేశారు.

సీఆర్‌పీఎఫ్ కమాండోలతో 15 మంది శివసేన ఎమ్మెల్యేలకు వై ప్లస్ రక్షణ

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో రాజకీయ సంక్షోభానికి కారణమైన 15 మంది శివసేన రెబల్ ఎమ్మెల్యేకు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో వై ప్లస్ భద్రతను కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తిరుగుబాటు ఎమ్మెల్యేలకు, వారి కుటుంబ సభ్యులకు ప్రాణ హాని ఉందని భద్రతా సంస్థలు కేంద్ర హోంశాఖ వర్గాలకు అందించిన సమాచారం మేరకు వారికి వై ప్లస్ భద్రతను కల్పించాలని కేంద్రం ఆదేశించినట్టు హోంశాఖ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే రమేశ్ బోర్నారే, మంగేష్ కుడాల్కర్, సంజయ్ శిర్సత్, లతాబాయి సోనావానే, ప్రకాశ్ సర్వే సహా మరో పది మంది ఎమ్మెల్యేలు మహారాష్ట్రలోకి వచ్చినప్పటి నుంచి ఐదురుగు సీఆర్‌పీఎఫ్ కమాండోలతో షిఫ్టుల వారీగా భద్రతను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో తాజాగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సదరు ఎమ్మెల్యేలకు, వారి కుటుంబ సభ్యులకు కూడా బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయనే సమాచారం కూడా ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి కేరళ అసెంబ్లీ సమావేశాలు

తిరువనంతపురం: బంగారం స్మగ్లింగ్‌లో కీలక నిందితురాలు వెల్లడించిన విస్మయకరమైన విషయాలు మొదలుకుని, ఇటీవల రాహుల్‌గాంధీ కార్యాలయంపై జరిగిన దాడి దాకా అధికార పక్షాన ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. సోమవారం నుంచి కేరళ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభకానున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్‌ల డిమాండ్‌లను చర్చించి ఆమోదించడానికి ప్రధానంగా ఒక నెలపాటు ఈ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఇటీవల తిక్కాకర అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో ఉంది. కొంత కాలంగా బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక నిందితురాలు స్వప్న సురేశ్ తాజాగా వెల్లడించిన విషయాలపై అధికార సీపీఎం, ముఖ్యమంత్రి విజయన్‌లు ఇప్పటికే ప్రధాన ప్రతిపక్ష పార్టీ నుంచి తీవ్ర నిరసనలు ఎదుర్కొంటున్నారు.

ఆతిథ్యరంగంలో మహిళా ఉద్యోగులపై అధిక ఒత్తిడి

న్యూఢిల్లీ: అతిథ్య పరిశ్రమలోని మహిళా ఉద్యోగులు పనిపరంగా పురుషుల కంటే ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అయితే సహెూద్యోగుల మూస పద్ధతి, ముందస్తు భావనలు, యజమానుల పితృస్వామ్య వైఖరులు ఈ రంగంలో మహిళల ఉన్నతికి ప్రధాన అవరోధంగా ఉన్నాయని నూతన అధ్యయనం వెల్లడించింది. 'భారత ఆతిథ్య పరిశ్రమలో లింగ సమానత్వ స్థితి మూల్యాంకనం' పేరుతో ఉమెన్స్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డబ్ల్యూఐసీసీఐ) అండ్ ఇండియన్ స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ (ఐఎస్‌హెచ్) అధ్యయనాన్ని నిర్వహించింది. దీని ప్రకారం మహిళా ఉద్యోగులు వ్యక్తిగత స్థాయిలో వారితో పాటు పనిచేసే పురుషుల కంటే పనిపరంగా అధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా మహిళల నెట్‌వర్కింగ్ సామర్థ్యాలు తక్కువగా అంచనా వేయడంతో పాటు వారు పని కోసం ప్రయాణించవలసి వచ్చినప్పుడు వారు చలనశీలత సమస్యలను ఎదుర్కొంటారన్న భావన నెలకొంది. సమూహ స్థాయిలో, సహోద్యోగుల మూస పద్ధతులు, ముందస్తు ఆలోచనలు, యజమానుల పితృస్వామ్య వైఖరులు మహిళా ఉద్యోగులకు పెద్ద అవరోధంగా ఉన్నాయి. అయితే సంస్థ స్థాయిలో సరైన మార్గదర్శకాలు లేకపోవడం వారికి తీవ్ర సవాలుగా మారిందని అధ్యయనం ఎత్తిచూపింది. 'మనం బహిరంగంగా పితృస్వామ్య సమాజంలో జీవిస్తున్నాం.

ఇక్కడ మహిళలు ఉద్యోగులుగా, ఇంట్లో పిల్లలు, వృద్ధ అత్తమామలకు ప్రాథమిక సంరక్షకులుగా పురోగమిస్తారని భావించబడుతోంది. అయితే భారత మహిళలు అభివృద్ధి చెందుతున్న ఆతిథ్య పరిశ్రమలో అగ్రస్థానానికి చేరుకోవాల్సి అవసరం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. వారికి ప్రతిభ, డ్రైవ్ మాత్రమే కాదు, సంస్థాగత, కుటుంబ మద్దతు వంటి లోతైన నిర్మాణాలు కూడా అవసరం' అని ఇండియన్ స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ రీసెర్చ్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ పాయల్ కుమార్ చెప్పారు. అధ్యయనం కోసం ఓ బృందం వివిధ సంస్థలలో సీనియర్, మధ్య స్థాయి స్థానాల్లోని 23మంది ఎగ్జిక్యూటివ్‌లతో మాట్లాడింది. వీరిలో మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్, జనరల్ మేనేజర్, డైరెక్టర్ హ్యూమన్ రిసోర్సెస్ వంటి వివిధ స్థాయిలలో పనిచేసే (పురుషులు, మహిళలు ఉన్నారు. ఈ ఎగ్జిక్యూటివ్‌లంతా మారియట్ ఇంటర్నేషనల్, ఐహెచ్‌జీ హోటల్స్ అండ్ రిసార్ట్స్, సరోవర్ హోటల్స్ & రిసార్ట్స్, క్రౌన్ ప్లాజా హోటల్స్ & రిసార్ట్స్, రాడిసన్ హోటల్ గ్రూప్, అకార్, ఓయో హోటెలివేట్, ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్, ఫార్చ్యూన్ హోటల్స్‌తో సహా దేశవ్యాప్తంగా అనేక హాస్పిటాలిటీ బ్రాండ్‌ల నుండి వచ్చారు. 'మహిళలు ఇతర పరిశ్రమలలో ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పటికీ, వారు తరచుగా ఆతిథ్యం, పర్యాటక రంగాలలో ప్రాతినిథ్యం వహిస్తున్నారని స్పష్టంగా తెలుస్తుంది. ఈ రంగాలలో ఉపాధి పొందుతున్న మహిళల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, వారు నైపుణ్యం లేని, తక్కువ జీతంతో కూడిన ఉద్యోగాలకు మాత్రమే పరిమితమవుతారు. అరుదుగా మాత్రమే నాయకత్వ పాత్రలకు ఎదుగుతారు' అని ఇండియన్ స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ వ్యవస్థాపకుడు, సీఈఓ దిలీప్ పూరి అన్నారు.

తీస్తా సేతల్వాద్ అరెస్టు దారుణం

సీపీఐ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్ : హక్కుల కార్యకర్త తీస్తా సేతల్వాద్‌ను అరెస్టు చేయడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ ఖండించారు. 22 ఏళ్ల క్రితం గుజరాత్‌లో చోటు చేసుకున్న మత ఘర్షణలు, అల్లర్ల విషయంపై సుధీర్ఘపోరాటం చేసిన ఆమెపై అత్యున్నత న్యాయవ్యవస్థ తన పరిధిని దాటి వ్యాఖ్యలు చేసినట్టు తాను భావిస్తున్నట్టు పేర్కొన్నారు. గుజరాత్ అల్లర్లకు కారణమెవరనే విషయం ప్రపంచం మొత్తం తెలుసని చెప్పారు. కళ్లు లేని వ్యక్తులకు కూడా ఆ అల్లర్లకు కారణమెవరనే విషయం స్పష్టంగా తెలుసని ఆదివారం మీడియాకు విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో వ్యాఖ్యానించారు. గుజరాత్ అల్లర్ల విషయంపై ఎంతో కాలంగా తీస్తా సేతల్వాద్ చేసిన న్యాయపోరాటంపై విచారించిన సుప్రీం కోర్టు ఆమె నిరాధార ఆరోపణలు చేశారని వ్యాఖ్యానించంతో తాను విభేదిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆమె న్యాయపోరాటానికి అత్యున్నత న్యాయ స్థానమే దురుద్దేశాన్ని అంట గట్టడాన్ని తప్పుబట్టారు. న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను అవకాశంగా తీసుకున్న పోలీసులు ఒక్క రోజు గడవకముందే ఆమెను అన్యాయంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో కోతికి కొబ్బెర చిప్ప దొరికిన చందాన పోలీసులు వ్యవహరించారని చురకలు వేశారు. ఆమె అరెస్టుకు న్యాయవ్యవస్థ చేసిన వ్యాఖ్యలే కారణమని స్పష్టం చేశారు. తీస్తా సేతల్వాద్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ సైతం తాము ఇచ్చిన తీర్పుపై పున:పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా తగ్గిన కోవిడ్ కేసులు

న్యూఢిల్లీ : దేశంలో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. కొన్ని రోజులుగా 15వేలకుపైగానే నమోదువుతోన్న కొత్త కేసులు తాజాగా భారీగా తగ్గి 11 వేలకు దిగివచ్చాయి. మరోవైపు క్రియాశీల కేసులు 92 వేలు దాటడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం శనివారం 4,53,940 నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, కొత్తగా 11,739 కేసులు వెలుగు చూశాయి. కొత్త కేసుల్లో కేరళ(4,098), మహారాష్ట్ర (1,728), తమిళనాడు (1,382) నుంచే సగానికిపైగా ఉన్నాయి. శనివారం 25 మంది కరోనాతో ప్రాణాలు కోల్పోగా.. ఇప్పటి వరకూ మృతి చెందిన వారి సంఖ్య 5,24,999కు చేరింది. శనివారం 10,917 మంది కోలుకోగా.. ఇప్పటి వరకూ వైరస్‌ను జయించిన వారి సంఖ్య 4.27 కోట్లు(98.58%) దాటింది. ఇక క్రియాశీల కేసులు క్రమంగా పెరుగుతూ లక్ష వైపునకు దూసుకెళ్తున్నాయి. ప్రస్తుతం దేశంలో 92,576(0.21%) యాక్టివ్ కేసులు ఉన్నాయి. దేశంలో వాక్సినేషన్ నిరంతరాయంగా కొనసాగుతోంది. శనివారం 12,72,739మంది టీకాలు తీసుకోగా.. ఇప్పటి వరకూ పంపిణీ చేసిన డోసుల సంఖ్య 197 కోట్లు దాటింది.

ప్రధాని పరధ్యానంగా ఉన్నారు: రాహుల్

న్యూఢిల్లీ: ఓ వైపు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని పరధ్యానంగా ఉన్నారంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి పాండిత్యం అత్యధిక నిరుద్యోగ రేటు, 30ఏళ్ల అధిక టోకు ధరల సూచిక, విలువ తగ్గింపు వంటి విపత్తులను దాచలేకపోయిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరుపై రాహుల్ తీవ్రంగా మండిపడ్డారు. యువతకు తక్షణము ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

దూసుకెళ్లిన వాహనం...

9 మంది మృతి... 8 మందికి గాయాలు

బెలగావి (కర్ణాటక): స్థానిక ఓ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున గూడ్స్ వాహనం ప్రవాహంలో పడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై స్పందించారు. మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షలు, గాయపడ్డ వారికి రూ.2 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు. ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న బెళగావి పోలీస్ కమిషనర్ ఎంబీ బోరలింగయ్య సహాయకచర్యలను పర్యవేక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గోకాక్ తాలూకాలోని అక్కాతంగియార హాలా గ్రామానికి చెందిన కూలీలు బెలగావికి వెళ్తుండగా బెలగావిలోని కనబరగి గ్రామం వద్ద వాహనం 'బళ్లారి నాలా'లో పడిపోయింది. కూలీలు బెలగావికి వెళ్తున్న భవన నిర్మాణ కార్మికులు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం ప్రవాహంలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు కాగా, ఒక కార్మికుడి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో వాహనం కింద ఉన్న వారిని బయటకు తీశారు.

ముందస్తు కరోనా వాక్సిన్ డోసు తీసుకోండి: మోదీ

న్యూఢిల్లీ: కరోనా వైరస్ బారినపడకుండా తగు సమయంలో ముందు జాగ్రత్త వాక్సిన్ డోసు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే చేతి పరిశుభ్రత, మాస్కులు వంటి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తతగా ఉండాలని సూచించారు. నెలవారీ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈ రోజు దేశం వాక్సిన్‌ల రూపంలో కరోనా నుంచి సమగ్ర రక్షణ కవచాన్ని కలిగి ఉండటం సంతృప్తికర విషయమని మోదీ అన్నారు. 'మనం దాదాపు 200 కోట్ల వాక్సిన్ డోసులను చేరుకున్నాము. దేశంలో ముందస్తు జాగ్రత్త వాక్సిన్ డోసు పంపిణీ కూడా వేగంగా సాగుతోంది' అని అన్నారు. 'మీ రెండవ డోసు తర్వాత ముందు జాగ్రత్త డోసు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైతే, మీరు ఈ మూడవ డోసు తప్పనిసరిగా తీసుకోవాలి. మీ కుటుంబ సభ్యులను, ముఖ్యంగా వృద్ధులకు, ముందుజాగ్రత్తగా డోసు తీసుకోండి. మనం చేతుల పరిశుభ్రత, మాస్కులు వంటి అవసరమైన జాగ్రత్తలు కూడా తీసుకోవాలి' అని మోదీ అన్నారు. వర్షాకాలంలో పరిసరాల అపరిశుభ్రత కారణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలో శనివారం వరకు పంపిణీ చేసిన కరోనా వాక్సిన్ డోసుల సంఖ్య 197 కోట్లు దాటినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

తిరుగుబాటుదారులంతా ద్రోహులే

శివసేన కార్యకర్తల ఆగ్రహం

మహారాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

ముంబై : శివసేన పార్టీకి రెబల్స్‌లా మారిన ఏక్‌నాథ్ షిండే సహా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ ద్రోహులంటూ ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. శివసేన ఎమ్మెల్యేల తిరుగుబాటు కారణంగా రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీకి వెన్నుపోటు పొడిచి రెబల్స్‌గా మారిన నేతలను వ్యతిరేకిస్తూ శివసేన శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. రెబల్స్‌గా మారిన ఎమ్మెల్యేల కార్యాలయాల్ని ముట్టడించే ప్రయత్నాలు చేస్తున్నారు. ముంబైలో పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేకు మద్దతుగా ఆదివారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. పూనెలోనూ భారీ ఆందోళన జరిగింది. పార్టీకి ద్రోహం చేసిన వారిని శివసైనికులు ఎన్నటికీ క్షమించరనే సంకేతాలు ఇవ్వడం కోసమే తాము ఆందోళనలు చేపట్టినట్టు శివసేన పార్టీ పూనె నగర అధ్యక్షులు గజానన థార్కుడే పేర్కొన్నారు. ఆయన నేతృత్వంతో చేపట్టిన ఆందోళనలో పార్టీపై తిరుగుబాటు చేసిన షిండే, ఇతర ఎమ్మెల్యేల ఫోటోలతో రూపొందించిన బ్యానర్‌ను చెప్పులతో కొడతూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటరు కూడా పాల్గొన్నారు. శివసేన సీనియర్ మంత్రిగా ఉన్న ఏక్‌నాథ్ షిండే బీజేపీ ఉచ్చులో చిక్కి పార్టీకి ద్రోహం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఇది క్షమించరాని తప్పని పేర్కొన్నారు. పార్టీకి ద్రోహం చేసినవారు ఎవరైనా ఊరుకోబోమని హెచ్చరించారు. ఇదిలా ఉండగా శనివారం ముంబైలోని కత్రాజ్ ప్రాంతానికి చెందిన తిరుగుబాటు ఎమ్మెల్యే తానాజీ సావంత్ కార్యాలయాన్ని శివసేన కార్యకర్తలు ధ్వంసం చేశారు. ముంబైలోని శివసేన అధికారిక పత్రిక సామ్నా కార్యాలయం వెలుపల మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏక్‌నాథ్ షిండే సహా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ చేపట్టారు. శివసేన పార్టీ బాల్ ఠాక్రే కి చెందినదని, దానిపై ఎవరికీ హక్కులు లేవని షిండేకు హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా శివసేన కార్యకర్తలు ఆందోళనలకు దిగడంతో ముంబై సహా రాష్ట్రంలోని కీలకమైన నగరాలు పట్టణాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

పాకిస్తాన్ జైల్లో సరబ్‌జీత్ సింగ్ సోదరి దల్బీర్ కౌర్ హత్య

అమృత్‌సర్ : పాకిస్తాన్‌లోని లాహోర్ జైలులో శిక్ష అనుభవిస్తూ ఖైదీల దాడిలో మృతి చెందిన పంజాబ్‌కు చెందిన సరబ్‌జీత్ సింగ్ సోదరి దల్బీర్ కౌర్ (67) ఆదివారం మృతి చెందారు. శనివారం రాత్రి దల్బీర్ కౌర్ తీవ్ర అనారోగ్యానికి గురవగా కుటుంబ సభ్యులు ఆమెను అమృత్‌సర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందినట్టు సరబ్‌జీత్ సింగ్ కుమార్తె పూనమ్ కౌర్ తెలిపారు. దల్బీర్ కౌర్ అంత్యక్రియలను ఆమె స్వస్థలమైన భిఖివిండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరికొన్ని వివరాల్లోకి వెళితే పాకిస్థాన్‌లోనూ ఉన్న పంజాబ్ ప్రాంతంలో వరుస బాంబు పేలుళ్లు, తీవ్ర వాద కార్యకాలాపాల ఆరోపణల నేపథ్యంలో భారత్‌కు చెందిన సరబ్‌జీత్‌ను పాక్ ప్రభుత్వం అరెస్టు చేసింది. అయన్ను జైలులోనే నిర్బంధించింది. ఆయనపై విచారణ జరిపి నిందితుడిగా తేల్చి 1991లో మరణశిక్ష విధించింది. అయితే వివిధ కారణాల నేపథ్యంలో ఆ శిక్షను పూర్తిగా నిలుపుదల చేస్తూ 2008లో ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన్ను లాహోర్ జైలులోనే నిర్బంధించింది. ఈ క్రమంలో తన సోదరుడిని పాక్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని మండిపడుతూ ఆయన సోదరి దల్బీర్ కౌర్ చేపట్టిన ఆందోళనలు దేశం దృష్టిని ఆకర్షించాయి. తన సహోదరుడు చేయని తప్పునకు పాక్ ప్రభుత్వం విధించిన యావజ్జీవ కారాగార శిక్షను వ్యతిరేకిస్తూ సరబ్‌జీత్‌ను విడుదల చేయాలని ఆమె నడిపిన పోరాటాలు పంజాబ్ ప్రజలను కదిలించిన విషయం తెలిసిందే. కానీ లాహోర్ జైలులోనే ఉన్న సరబ్‌జీత్ సింగ్‌పై అదే జైలులో ఉంటున్న ఖైదీలు 2013 ఏప్రిల్‌లో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన ఆరు రోజుల అనంతరం కన్నుమూశారు. సరబ్‌జీత్ సింగ్ జీవితం ఆధారంగా 2016లో ఒక సినిమా రూపొందింది. ఇందులో ఆయన సోదరి దల్బీర్ కౌర్ పాత్రను ప్రముఖ నటి ఐశ్వర్యరాయ్ పోషించారు.

అసోం జలదిగ్బంధం

గువహటి: అసాంలో వరద పరిస్థితి ఆదివారం దారుణంగా మారింది. 25 లక్షల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టింది. ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ కచార్ జిల్లాలోని సిల్చార్‌ను సందర్శించారు. ఈ ప్రాంతం చాలా భాగం దెబ్బతింది. బరాక్ లోయ నగరంలో వరదల నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసింది. అసోం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తాజా సమాచారం ప్రకారం, రాష్ట్రంలోని 79 రెవెన్యూ సర్కిళ్లు, 2,894 గ్రామాలతో కూడిన 27 వరద బాధిత జిల్లాల్లో 25 లక్షల మందికి పైగా ప్రజలు ఇప్పటి వరకూ నిరాశ్రయులయ్యారు. రెండు వారాలుగా వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఈశాన్య రాష్ట్రంలోని 637 సహాయ శిబిరాల్లో 2.33 లక్షల మంది తలదాచుకున్నారు. వారికి సహాయ సామగ్రి పంపిణీ చేశారు. 259 పంపిణీ కేంద్రాల ద్వారా షెల్టర్ క్యాంపుల వద్ద ఉంచిన బాధిత జనాభాకు సహాయ సామగ్రి పంపిణీ చేసినట్టు ఏఎస్‌డీఎంఏ బులెటిన్ తెలిపింది. ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్, ఎమర్జెన్సీ సర్వీసెస్, పోలీసు ఏఎస్‌డీఎంఏ వాలంటీర్లు వంటి రాష్ట్ర బలగాలు కాకుండా ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితంగా తరలించడంలో ఎన్‌డీఆర్ఎఫ్ జిల్లా పరిపాలనకు సహాయం చేస్తోంది. ఇప్పటివరకు 67,237 మందిని వివిధ ఏజెన్సీలు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు బులెటిన్‌లో పేర్కొంది. అసోంలోని వివిధ ప్రాంతాల్లో వరదల కారణంగా శనివారం మరో నలుగురు వ్యక్తులు మరణించారు. వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల రాష్ట్రంలో ఈ సంవత్సరం మృతుల సంఖ్య సంఖ్య 121కి పెరిగింది. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో తాజాగా కొండచరియలు విరిగిపడినట్లు ఏఎస్‌డీఎంఏ తెలిపింది. గత 24 గంటల్లో రాష్ట్రంలో సగటున 7 మి.మీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మార్చి 1 నుండి 1,891.90 మి.మీ వర్షపాతం నమోదైంది. కేంద్ర జల సంఘం సమాచారం ప్రకారం, నాగావ్‌లోని ధర్మతుల్ వద్ద కొపిలి నది, కరీంగంజ్‌లోని బీపీ ఘాట్, కాచర్‌లోని ఏపీ ఘాట్ వద్ద బరాక్, కరీంబాగ్‌లోని దాని ఉపనది కుషియారా ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

మాట్లాడుతున్న రాఘవేంద్రరావు. వేదికపై మానం ఆంజనేయులు, భాస్కరరావు, నాగభూషణ చౌదరి, ఎజె స్టాలిన్, నామన కామరాజు, ఆర్‌వి జగ్గారావు తదితరులు

ప్రజా సంక్షేమమే వీసీబీ లక్ష్యం

- సభ్యుల మద్దతుతోనే గణనీయమైన అభివృద్ధి
- వీసీబీ 107 మహాజన సభలో
- బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

విశాలాంధ్ర - విశాఖపట్నం: పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల సంక్షేమం కోసమే ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పని చేస్తోందని బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు రావు అన్నారు. సభ్యుల సహకారం, మద్దతుతోనే బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఆదివారం విశాఖ నగరంలోని కాకతీయ కన్వెషన్ సెంటర్ నందు నిర్వహించిన వీసీబీ 107వ మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చలసాని రాఘవేంద్రరావు రావు మాట్లాడుతూ ... 2022 మార్చి చివరి నాటికి బ్యాంకులో రూ.3889.28 కోట్లు డిపాజిట్లు ఉండగా , రూ.2863.54 కోట్ల మేర రుణాలను అందించినట్టు తెలిపారు. బ్యాంకు కార్యకలాపాల మొత్తం విలువ రూ.6752.82 కోట్లకు చేరుకుందని వివరించారు. బ్యాంకులో 92, 200 మంది సభ్యులతో రూ.272.00 కోట్ల షేరు ధనం (వాటాదారుల ధనం) ఉందని తెలిపారు. బ్యాంకు ఇచ్చిన రుణాల్లో 0.47 నిరర్థక ఆస్తులుగా ఉన్నట్టు తెలిపారు. బ్యాంకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపట్టిన ఆరోగ్యబీమా కింద 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1,335 మంది సభ్యులకు రూ. 3.62 కోట్లు అందించినట్టు తెలిపారు. వివిధ కారణాలతో మృతి చెందిన 1,046 మంది షేర్ హోల్డర్‌ల కుటుంబసభ్యులకు రూ. 2.75 కోట్లు అందించినట్టు తెలిపారు. వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన 11 మంది కుటుంబ సభ్యులకు రూ. 5.50లక్షల చొప్పున చెల్లించినట్టు తెలిపారు. బ్యాంకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసమే రూ.6.43 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రూ.66.80 కోట్ల నికరలాభం ఆర్జించిందని తెలిపారు. వచ్చిన లాభాల్లోంచి చట్టబద్ధంగా చెల్లించాల్సిన నిధులు పోగా షేర్ హోల్డర్‌లకు 10 శాతం డివిడెంటును అందించాలని సభలో ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. డివిడెంటు రూపంలో షేర్ హోల్డర్‌లకు రూ.24.96 కోట్లు చెల్లించనున్నట్టు వివరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,300 కోట్ల డిపాజిట్ల సేకరణతో 3,200 కోట్ల మేర అప్పులు ఇవ్వాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. షేర్ హోల్డర్‌ల (వాటాదారుల) సంఖ్య లక్షకు చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. బ్యాంక్ ఎమిరిటస్ చైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ కరోనా విపత్కర స్థితిలో బ్యాంకు సభ్యులను, పేద మధ్యతరగతిని ఆదుకునే ఉద్దేశంతో చాలా తక్కువ వడ్డీకి రుణాలు అందించినట్టు తెలిపారు. బ్యాంకు నిర్వహణలో సంప్రదింపుల కమిటీలు కీలక పాత్ర పోషించాలని కోరారు. అభివృద్ధికి సలహాలు సూచలను ఇవ్వాలని, వారి సూచనలను అన్ని బ్రాంచిలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ గుడివాడ భాస్కరరావు, డైరెక్టర్లు సూరపనేని నాగభూషణ చౌదరి, ఎజె స్టాలిన్, నామన కామరాజు, ఆర్‌వి జగ్గారావు, వి చంద్రశేఖర్, చెలికాని రామారావు, చెరువు ఆదినారాయణ శాస్త్రీ, ఎస్ జానకి రామచంద్రరాజు, పివి రమణా రావు, కందా ప్రసాద రావు, జేవీ సత్యనారాయణ మూర్తి, సీహెచ్ కోటేశ్వరరావు, పి నారాయణ స్వామి, కాకి భవాని, టి పద్మావతి, కో ఆప్టెడ్ డైరెక్టర్లు డి. బాబురావు, రామమూర్తి వైద్యనాథన్, బ్యాంక్ సీఈవో పివి నరసింహ మూర్తి, జనరల్ మేనేజర్ ఎ వి రామకృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే మతోన్మాదం నుంచి విముక్తి

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి

మక్దూంభవన్‌లో నల్లూరి 'నేను నడిచిన బాట' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, మాదాల రవి, అజీజ్ పాషా, పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ తదితరులు

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో రాజ్యమేలుతున్న మతోన్మాదం, మూఢ విశ్వాసాల నిర్మూలనకు మళ్లీ పెద్దయెత్తున ప్రజా పోరాటాలు అవసరమని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. ప్రజాపోరాటలకు వెన్నుదన్నుగా కళాకారులు, రచయితలు రంగంలోకి దిగాల్సిన అవసరముందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ముసుగులో ఫాసిజం దేశంలో విధ్వంసాన్ని సృష్టిస్తోందని, దేశంలో పౌర, మానవ హక్కులు కాలరాసే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు... నియంతృత్వానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు రాసిన 'నేను నడిచిన బాట' పుస్తకావిష్కరణోత్సవం హైదరాబాద్ మక్దూంభవన్‌లో ఆదివారం జరిగింది. ఈ పుస్తకాన్ని తెలుగు విశ్వవిద్యాలయ మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ పరిచయం చేశారు. సినీ హీరో, దర్శక నిర్మాత మాదాల రవి సభకు అధ్యక్షత వహించగా సురవరం సుధాకర్ రెడ్డితోపాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర ఇన్‌చార్జి కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు, 'ప్రజాపక్షం' సంపాదకులు కె.శ్రీనివాస్ రెడ్డి, ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖర్ రావు, ప్రముఖ సినీ నిర్మాత పోకూరి బాబూరావు, సినీ దర్శకుడు భీమినేని శ్రీనివాస రావు, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, సినీ దర్శకుడు మాదినేని రమేష్, బాబ్జీ, తెలంగాణ ప్రజా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, నాయకులు లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, ఇప్టా సీనియర్ నాయకుడు రాజేశ్వరరావు తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో చోటు చేసుకున్న అనేక మార్పులు, పార్టీ, యువజన, ప్రజా నాట్యమండలికి సంబంధించి అత్యంత విలువైన సమాచారాన్ని 'నేను నడిచిన బాట'లో పొందుపరిచారని కొనియాడారు. కొన్ని చేదు అనుభవాలను, కొన్ని ఇబ్బందులను మినహాయించి అన్నీ మంచి విషయాలనే నల్లూరి రాశారని, ఇతరులను నొప్పించడం ఆయన వ్యక్తిత్వం కాదని అన్నారు. నల్లూరి జీవిత చరిత్రలోని అనేక అంశాలను యువతరం చదివి తెలుసుకోవాలని, తద్వారా ఆ స్ఫూర్తిని పొందుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి జర్నలిస్టు కూడా తమ జీవిత చరిత్రను రాయాలని, తద్వారా ఆ చరిత్రలో వారి వారి అనుభవాలను నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రజానాట్య మండలి, యువజన విభాగానికి నల్లూరి వెంటకేశ్వర్లు, కందిమళ్ల ప్రతాపరెడ్డి రెండు కళ్ల లాంటి వారని కొనియాడారు. వారు నేటి యువతరానికి స్ఫూర్తిగా మిగిలారని, ప్రజా నాట్య మండలిని పునరుద్ధరించేందుకు శాయశక్తులా కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కూడా ప్రజా నాట్యమండలి అనేక మంది అద్భుత కళాకారులను తయారు చేసిందని, సమాజంపై కవులు, కళాకారుల ప్రభావం చూపిందన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమి అనేది పక్కన పెడితే ముందుగా సమాజాన్ని మార్చాలన్న పట్టుదలను ప్రజల్లో తీసుకొచ్చి... వారిలో చైతన్యం కల్పించడంలో ప్రజా నాట్య మండలి అద్వితీయ పాత్రను పోషించిందని వివరించారు. ఫ్యూడలిజానికి, వలస వాదనానికి, నాటి నిజాం నిరంకుశ పాలకు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి... నాటకాలు, బుర్ర కథల ద్వారా ప్రజలను రంగంలోనికి దించేందుకు అద్భుత పాత్రను పోషించిందని చెప్పారు. దోపిడీ, దారిద్ర్యం, అణచివేత ఉన్నంత కాలం వామపక్ష ఉద్యమాలు ఉంటాయని, పునర్జీవిస్తాయని సురవరం అన్నారు. మాదాల రవి మాట్లాడుతూ నల్లూరి వెంకటేశ్వర్లు ఒక వ్యక్తి కాదని, ఒక ఉద్యమం అన్నారు. ప్రజానాట్య మండలి, కమ్యూనిస్టు నాయకునిగా ఆయన అందించిన సేవలు అందరికీ తెలుసన్నారు. నల్లూరిలో ప్రజలను చైతన్యవంతం చేయాలనే తపన ఉంటుందన్నారు. ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ 'నేను నడిచిన బాట'ఒక కమ్యూనిస్టు ఆత్మ కథ అని, నిబద్ధత కలిగిన విప్లవాకారుని స్వీయ చరిత్ర అని కొనియాడారు.

బెలారస్‌కు రష్యా అణుక్షిపణులు

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశాలు ఉండటంతో రష్యా కీలక నిర్ణయం తీసుకొంది. స్వల్పశ్రేణి అణుసామర్థ్య క్షిపణులను బెలారస్‌కు తరలించ నుంది. ఈ విషయాన్ని స్వయంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. ఇసికందర్-ఎం వ్యవస్థలు బాలిస్టిక్, క్రూజ్ క్షిపణులను సంప్రదాయ లేదా అణువార్ హెడ్లతో ప్రయోగించవచ్చు. శనివారం బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో సెయింట్ పీటర్స్ బర్గ్‌కు వచ్చారు. అక్కడ ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'రానున్న కొన్ని నెలల్లో బెలారస్‌కు ఇసికందర్-ఎం టాక్టికల్ మిసైల్ వ్యవస్థలను అందించాలని నిర్ణయం తీసుకొన్నాం' అని పేర్కొన్నారు. ఈ వ్యవస్థల తరలింపుపై రెండు దేశాల రక్షణ శాఖలు చర్చలు జరుపుతున్నాయి.

ఉప ఎన్నికలో బీజేపీ గెలుపు

- త్రిపురలో సీఎం మాణిక్ సాహా విజయం
- సంగ్రూర్‌ను కోల్పోయిన ఆప్
- జార్ఖండ్‌లో కాంగ్రెస్ గెలుపు

న్యూఢిల్లీ/లక్నో/అగర్తలా: త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహాతో సహా ముగ్గురు బీజేపీ అభ్యర్థులు దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో పంజాబ్‌లోని సంగ్రూర్ పార్లమెంటరీ నియోజకవర్గాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ కోల్పోవాల్సి వచ్చింది. అయితే దేశ రాజధానిలోని రాజిందర్‌నగర్ అసెంబ్లీ స్థానాన్ని ఆప్ నిలబెట్టుకుంది. ఐదు రాష్ట్రాలు, ఢిల్లీలోని మూడు లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలకు జూన్ 23న జరిగిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ పార్లమెంట్ స్థానంలో అధికార బీజేపీ అభ్యర్థి ఘన్‌శ్యాం లోధి 42,000 ఓట్ల తేడాతో గెలుపొందారు. బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం చేసిన పని వల్లే ఈ విజయానికి కారణమని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఢిల్లీలోని రాజిందర్‌నగర్‌లో ఆప్‌కి చెందిన దుర్గేష్ పాఠక్ 11,000 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి రాజేష్ భాటియాపై విజయం సాధించారు. పంజాబ్‌లో సిరోమణి అకాలీదళ్ (అమృత్‌సర్) నాయకుడు సిమ్రంజిత్ సింగ్ మాన్ సంగ్రూర్ లోక్‌సభ స్థానంలో ఆప్‌కి చెందిన గుర్‌మైల్ సింగ్‌పై 5,822 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ స్థానాన్ని ఆప్ నాయకుడు, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రెండుసార్లు గెలుచుకున్నారు. ఈశాన్య రాష్ట్రంలో పాగా వేయాలని చూస్తున్న టీఎంసీ అన్ని స్థానాల్లోనూ తమ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయింది. అగర్తల స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సుదీప్ రాయ్ బర్మన్ 3,163 ఓట్ల తేడాతో గెలుపొందారు. సుర్మాలో బీజేపీకి చెందిన స్వప్న దాస్ 4,583 ఓట్ల తేడాతో గెలుపొందారు. జార్ఖండ్‌లోని మందార్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శిల్పి నేహా టిర్కీ 23,517 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన గంగోత్రి కుజుర్‌పై విజయం సాధించారు. అయితే ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అగర్తలలోని కాంగ్రెస్ భవన్ ముందు కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణలో త్రిపుర పీసీసీ చీఫ్ బిరాజిత్ సిన్హాతో సహా కనీసం 19 మంది గాయపడ్డారు.

ఎమర్జెన్సీ చీకటి రోజుల్ని మరువద్దు

మన్ కీ బాత్‌లో ప్రధాని

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీ చీకటి రోజుల్ని దేశ ప్రజలు ఎవ్వరూ మరవరాదని, భావి తరాలకూ ఇవి గుర్తుండాలని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. నాడు ప్రజాస్వామ్యాన్ని అణచి వేయాలని చూశారని, నిరంకుశంగా వ్యవహరించారని, అన్ని వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ పేరును ప్రస్తావించకుండా ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ రోజులకు తాను సాక్షినని, నాడు జరిగిన పోరాటంలో భాగస్వామినని చెప్పుకున్నారు. అదే సమయంలో భారత్ అభివృద్ధిలో దూసుకెళుతోందని అన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యంతో స్టార్టప్‌ల జోరు సాగుతోందని చెప్పారు. '1975లో అత్యవస పరిస్థితిని విధించినప్పుడు ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని చూశారు. ప్రజాస్వామిక మాధ్యమాల ద్వారా నిరంకుశ మనస్తత్వాన్ని ఓడించిన ఇటువంటి ఉదాహరణ ప్రపంచంలో మరొకటి దొరకడం కష్టం' అని ఆదివారం మన్ కీ బాత్‌లో మోదీ వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్‌పై వాక్బాణాలను ఎక్కుపెట్టారు. అంతరిక్ష రంగంలో భారత్ విజయాలను ప్రస్తావించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు రంగానికి అవకాశాలను 'ఇన్ స్పేస్' ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 1975, జూన్ 25న అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించింది. 1977, మార్చి 21 వరకు అత్యవసర పరిస్థితి కొనసాగింది. ఇందుకు 47 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఇదే సందర్భాన్ని ప్రస్తావిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించే జీవిక, స్వేచ్ఛ హక్కులను నాడు కాలరాశారని, న్యాయ వ్యవస్థ, మీడియాతో పాటు అన్ని వ్యవస్థలపై ఆంక్షలు విధించారని, సెన్సార్‌షిప్ కఠినమైందని, అనుమతి లేకుండా ఏదీ ప్రచురించేందుకు వీల్లేదని మోదీ చెప్పారు. ప్రముఖ గాయకుడు కిశోర్ కుమార్‌గారిపై అప్పట్లో నిషేధం విధించారని, ప్రభుత్వాన్ని ప్రశంసించేందుకు ఆయన నిరాకరించడమే అందుకు కారణమని అన్నారు. వేలాది సంఖ్యలో అరెస్టులు జరిగాయని, లక్షలాది మందిపై దురాగతాలతో ప్రజాస్వామ్యంపై భారతీయుల విశ్వాసం సన్నగిల్లిందని చెప్పారు. శతాబ్దాలుగా మనలో పాతుకుపోయిన ప్రజస్వామిక విలువలు, మన నరాల్లో రక్తంతో పాటు ప్రవహించే ప్రజాస్వామిక స్ఫూర్తి చివరకు గెలిచిందని అన్నారు. 75ఏళ్ల స్వతంత్రాన్ని జరుపుకుంటూనే ఎమర్జెనీ చీకటి స్మృతులను భావితరాలు కూడా గుర్తుపెట్టుకోవాలని మోదీ అన్నారు. అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు వందల సంఖ్యలో ఉన్నాయన్నారు. గతంలో ప్రైవేటు రంగానికి అసాధ్యం అనుకున్నవి లేక ఆలోచనకే అందని అంశాలపై ఈ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని చెప్పారు. చిన్న పేలోడ్‌లను అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు లాంచ్ వెహికల్స్ అభివృద్ధికి అగ్నికుల్, స్కైరూట్ వంటి సంస్థలు కృషిచేస్తున్నాయని చెప్పారు. వినూత్న అంశాలపై పనిచేస్తున్న విద్యార్థుల్లో చాలా మంది చిన్న పట్టణాల వారు ఉన్నారని మోదీ అన్నారు. క్రీడాస్ఫూర్తిని శ్లాఘించారు. చోప్రా వంటి వారు దేశానికి గర్వకారణమన్నారు.

రంజీట్రోఫీ విజేత మధ్యప్రదేశ్

ఎంపీ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి

బెంగళూరు: దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్ సత్తాచాటింది. ఈ ఏడాది రంజీ ట్రోఫీని ఆ రాష్ట్ర క్రికెట్ జట్టు సొంతం చేసుకుంది. క్రికెట్‌కు పవర్‌హౌస్‌లాంటి ముంబై జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించి రంజీ చరిత్రలో తొలి సారి ట్రోఫీని దక్కించుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముంబైను 269 పరుగులకు కట్టడి చేసి, 108 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. కోచ్ చంద్రకాంత్ పండిట్‌కు ఇది ఆరో నేషనల్ టైటిల్.

మ్యాచ్ సాగిందిలా..!

ఈ ఏడాది రంజీ సెమీ ఫైనల్‌లో బెంగాల్‌ను ఓడించి మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌ను కట్టడి చేసి ముంబై జట్లు ఫైనల్‌కు చేరాయి. జూన్ 22న మొదలైన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన ముంబై బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 374 పరుగులకు ఆలౌట్ అయింది. సర్ఫరాజ్ ఖాన్ 134 (234 బంతుల్లో 13×4, 2×6) సెంచరీతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భాగంగా బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్ బ్యాట్స్‌మెన్ తమదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఓపెనర్ యశ్ దూబే 133 (336 బంతుల్లో 14×4) సహా శుభమ్ శర్మ 116 (215 బంతుల్లో 15×4, 1×6) రజిత్ పాటిదార్ 122 (219 బంతుల్లో 20×4) సెంచరీలతో అదరగొట్టగా, చివర్లో శరన్ష్ జైన్(57) అర్ధశతకంతో రాణించడంతో మధ్యప్రదేశ్ 536 పరుగుల భారీ స్కోరు చేసింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై మరోసారి పేలవ ప్రదర్శనతో 269 పరుగులకు ఆలౌట్ అయింది. 108 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ కేవలం నాలుగు వికెట్లు కోల్పోయి మ్యాచ్ గెలవడమే కాకుండా తొలిసారి రంజీ ట్రోఫీని ముద్దాడింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా శుభమ్ శర్మ ఎంపికగా, ఈ సీజన్‌లో 1000 పరుగులకు పైగా చేసిన సర్ఫరాజ్‌ఖాన్ (ముంబై) ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు.

కన్నీటి పర్యంతమైన కోచ్ రవిచంద్రకాంత్ పండిత్

మధ్యప్రదేశ్ జట్టు రంజీ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో కోచ్ రవి చంద్రకాంత్ పండిత్ భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. 1999లో ఆయన మధ్యప్రదేశ్ రంజీ జట్టు కెప్టెన్‌గా ఉన్న సమయంలో ఇదే చిన్నస్వామి స్టేడియంలో ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయారు. దాదాపు 23ఏళ్ల తర్వాత చంద్రకాంత్ కోచ్‌గా వ్యవహరించిన మధ్యప్రదేశ్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకోవడంతో స్టేడియంలోనే భావోద్వేగానికి గురయ్యారు. మధ్యప్రదేశ్ జట్టు రంజీ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హర్షం వ్యక్తం చేశారు. జట్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

వాక్సిన్ వేసుకునే ప్రసక్తే లేదు: జకోవిచ్

లండన్: ఎట్టి పరిస్థితుల్లోనూ కరోనా టీకా వేసుకోనని మరోసారి తేల్చిచెప్పాడు టెన్నిస్ దిగ్గజం నోవాక్ జకోవిచ్. ఇప్పటికే ఈ కారణం చేత ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడలేకపోయిన అతడు త్వరలో జరిగే యూఎస్ ఓపెన్‌లోనూ అలాంటి పరిస్థితే ఎదురైతే పట్టించుకోనని చెప్పాడు. దీంతో ఈ ఏడాది గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లలో ఈ సెర్బియా ఆటగాడికి సోమవారం నుంచి ప్రారంభమయ్యే వింబుల్డన్ టోర్నీనే చివరిది కానుంది. అతడు తిరిగి గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో పాల్గొనాలంటే వచ్చే ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ వరకు వేచి చూడాల్సిందే. వింబుల్డన్-2022 ప్రారంభానికి ముందు జకోవిచ్ మీడియాతో మాట్లాడాడు. 'ప్రస్తుత పరిస్థితుల్లో నేను వాక్సినేషన్ వేయించుకోని కారణంగా ఇప్పటి వరకూ అమెరికాలో అడుగుపెట్టడానికి వీలులేదు. ఈ విషయం గురించి నాకు స్పష్టమైన అవగాహన ఉంది. అయితే, అది నాకు ఈ వింబుల్డన్ టోర్నీలో మరింత విశేషంగా రాణించడానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. దీంతో వరుసగా నాలుగో సీజన్‌లోనూ ఈ టోర్నీలో విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. ఆ తర్వాత ఏం జరుగుతుందనేది చూడాలి. నాకైతే అమెరికాకు వెళ్లి ఆడాలని ఉంది. అయితే, ఇప్పటివరకు ఆ దేశంలో ఉన్న నిబంధనల ప్రకారం నేను అక్కడికి వెళ్లలేను. అందులో నేను చేసేదేం లేదు. అమెరికా ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. వాక్సినేషన్ తీసుకోని వాళ్లని అనుమతించాలా వద్దా అనేది వారి ఇష్టం' అని జకోవిచ్ పేర్కొన్నాడు. చివరగా వాక్సినేషన్ తీసుకోవడం ఇష్టం లేదా అని అడిగిన ప్రశ్నకి 'కచ్చితంగా లేద'ని స్పష్టం చేశాడు. అయితే, ఇదివరకే ఈ సెర్బియన్ స్టార్ వాక్సినేషన్‌పై తన అభిప్రాయం వెల్లడించాడు. తాను వాక్సిన్‌కు వ్యతిరేకం కాదని, కానీ.. తన శరీరంలోకి ఏది తీసుకోవాలో తీసుకోవద్దో నిర్ణయించుకునే హక్కు తనకు ఉందన్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.